www.mudranews.in
సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
హైదరాబాద్ బుధవారం, 28.01.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 101
పేజీలు: 12
వెల: రూ. 5
Published From: Hyderabad | Amaravathi | Vijayawada

## టీ20 వరల్డ్ కప్ సమరానికి కౌంట్ డౌన్
11

వార్మప్ మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల..

- ఫిబ్రవరి 4న దక్షిణాఫ్రికాతో భారత్ ఢీ!
- చిన్న జట్లకు ప్రాక్టీస్ కోసం భారతఏ జట్టును కేటాయించిన నిర్వాహకులు
- ఫిబ్రవరి 2-6 వరకు భారత్, శ్రీలంకలో మ్యాచులు
- బంగ్లాదేశ్ అవుట్ - స్కాట్లాండ్ ఇన్
- ఫిబ్రవరి 7 నుంచి కొలంబో వేదికగా పాకిస్థాన్-న్యూజిలాండ్ మధ్య తొలి మ్యాచ్
- వాంఖడేలో యూఏఈతో భారత్ తొలి మ్యాచ్





## సింగరేణిలో అవినీతి ప్రతిపక్షం కట్టుకథ
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- సింగరేణి టెండర్లపై ఆరోపణలు రాజకీయ ప్రేరితమే
- ప్రతిపక్షం చేస్తున్నది ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం
- మంత్రుల భేటీపై తప్పుడు ప్రచారం సరికాదు
- పాలనాపరమైన చర్చలు సహజమే
- అసత్య ప్రచారాలను కాంగ్రెస్ పట్టించుకోదు
- సర్పంచ్ ఫలితాలే మున్సిపల్ ఎన్నికల్లోనూ రిపీట్
- అన్ని పురపీఠాలపై కాంగ్రెస్ జెండా ఎగురుతుంది

03



## ముగిసిన సంతోష్ విచారణ
ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎంపీ హాజరు

- 5 గం. పాటు ప్రశ్నించిన సిట్ అధికారులు
- ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ప్రభాకర్‌రావు నియామకం నిర్ణయం ఎవరిదంటూ ప్రశ్నలు
- ఆధారాలు ముందు పెట్టి ప్రశ్నించిన సిట్
- సంతోష్‌రావు స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిన సిట్ అధికారులు

09

## బొగ్గు స్కాంపై విచారణకు ఆదేశించండి
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



- కోల్ మాఫియాకు నాయకుడిగా సీఎం
- బొగ్గు స్కాంపై విచారణకు ఆదేశించండి
- సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు చేయాలి
- విచారణ బాధ్యత కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఇవ్వండి
- గవర్నర్ కు బీఆర్ఎస్ నేతల వినతి

09

## గుంపుమేస్త్రికి ప్రధాన గూఢచారి సంతోష్ రావు
జాగృతి అధ్యక్షురాలు కవిత

- ఆయనకు శిక్షపడుతుందనే నమ్మకం లేదు
- పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పని చేయాలి
- ఈ దుర్మార్గుడికి కేటీఆర్, హరీశ్ రావు వత్తాసు
- సొమ్ము కుటుంబానికి జాగృతి అండ

03



# పురభేరి
## మోగిన మున్సిపల్ నగారా

- తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- నేటి నుంచి నుంచి ఈనెల 30 వరకు నామినేషన్లు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 52.43లక్షల మంది
- అందరూ ఓటు హక్కును వినియోగించుకోండి: రాణి కుముదిని
- అమల్లోకి ఎన్నికల కోడ్
- నగదు రవాణాపై కఠిన నియమాలు , గట్టి నిఘా
- పోలింగ్ , లెక్కింపు , భద్రతా ఏర్పాట్ల పూర్తి షెడ్యూల్



**ముద్ర, తెలంగాణ బ్యూరో**
తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్రంలోని 7 నగరపాలక సంస్థలు, 116 పురపాలక సంఘాలకు ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహించి ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే దఫాలో ఒకే రోజున ఈ ఎన్నికలు నిర్వహించబోతున్నామని చెప్పారు. ఫిబ్రవరి 11న ఒకే విడతలో పోలింగ్ నిర్వహించి, 13వ తేదీన ఫలితాలు వెలువడుతాయని ఆమె పేర్కొన్నారు. నేటి నుంచి ఈ నెల 28 వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఫిబ్రవరి 3వ తేదీన గడువు ముగుస్తుందని తెలిపారు. ఫిబ్రవరి 15వ తేదీ కల్లా మొత్తం ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించినట్లు తెలిపారు,. ఈ ఎన్నికలో మొత్తం 52.43లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారని చెప్పారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు. రీ పోలింగ్ ఎక్కడైనా అవసరం ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహించి మిగతా అన్ని స్థానాలతోపాటే ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో తక్షణమే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్, డిప్యూటీ మేయర్లు, మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్ పర్సన్ల ఎన్నిక ఉంటుందని తెలిపారు. కాగా నోటిఫికేషన్ విడుదలతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) తక్షణం అమల్లోకి వచ్చింది. రంజాన్, శివరాత్రి పండుగలను దృష్టిలో ఉంచుకుని ఈలోపే ఎన్నికలు ముగించాలని

మిగతా 02లో..

### ఎన్నికల వివరాలు

| |
|---|
| కార్పొరేషన్లు: 07<br>కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, మహబూబ్ నగర్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ |
| కార్పొరేషన్ల పరిధిలో డివిజన్ల సంఖ్య: 414 |
| మున్సిపాలిటీలు: 116 |
| మున్సిపాలిటీల్లో వార్డుల సంఖ్య: 2,582 |
| రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య: 52.43 లక్షలు |
| పురుష ఓటర్లు : 25.62 లక్షలు |
| మహిళా ఓటర్లు : 26.80 లక్షలు |
| ఇతర ఓటర్ల సంఖ్య : 640 |
| మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపిక: 14.02.2026లోగా |
| మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్, వైస్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం: 16.02.2026 |

### నామినేషన్ల స్వీకరణ

| |
|---|
| నేటి నుంచి ఈనెల 30 వరకు (సాయంత్రం 5:00 గంటల వరకు) |
| నామినేషన్ల పరిశీలన : జనవరి 31 |
| నామినేషన్ల ఉపసంహరణ గడువు: ఫిబ్రవరి 3 మధ్యాహ్నం 3 గంటల వరకు |
| పోలింగ్ తేదీ: ఫిబ్రవరి 11, 2026 ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు |
| రీ-పోలింగ్ (అవసరమైతే): ఫిబ్రవరి 12, 2026. |
| ఓట్ల లెక్కింపు , ఫలితాలు: ఫిబ్రవరి 13, 2026 |

## అది సీక్రెట్ మీటింగ్ కాదు



మున్సిపల్ ఎన్నికలపై చర్చించాం

- మంత్రుల భేటీపై సోషల్ మీడియా, కొన్ని ప్రసార మాధ్యమాల్లో 'విష ప్రచారం'
- వ్యక్తిత్వ హననానికి పాల్పడితే ప్రజాస్వామ్యానికే ముప్పు
- మంత్రుల భేటీపై శ్రీధర్ బాబు క్లారిటీ

03

## నేటి నుంచే మహా జాతర
మేడారానికి బయల్దేరిన పగిడిద్దరాజు, గోవిందరాజు

- సమ్మక్క సారలమ్మ మహాజాతరకు పోటెత్తుతున్న భక్తులు
- రవాణా శాఖ ప్రత్యేక ప్రణాళిక, 7 సబ్ డిపోలతో ఆర్టీసీ సిద్ధం
- భద్రత—సౌకర్యాలపై దృష్టి, పోలీస్, రెవెన్యూ, వైద్య శాఖల సమన్వయం

10



## కవితతోనే కష్టం
ఫోన్ ట్యాపింగ్‌లో బీఆర్ఎస్ అంతర్మథనం



- కవితకు నోటీసులు ఇచ్చే ఛాన్స్
- విచారణకు వెళ్తే గండమే
- హరీష్, సంతోష్ పాత్ర వివరిస్తారని భయం
- ఈ కేసుపై బహిరంగ విమర్శలు
- తన భర్త ఫోన్ ట్యాప్ చేశారన్న కవిత

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
ఫోన్ ట్యాపింగ్ కేసులో మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ కు ఇప్పుడు అసలు సిసలు భయం పట్టుకున్నది. ఓవైపు రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు రోజుకో కొత్త మలుపు తీసుకుంటుంటోంది. ఇప్పటికే ఈ కేసులో మాజీ మంత్రి హరీష్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జోగినపల్లి సంతోష్ రావుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసి.. విచారణకు పిలిచింది. విచారణకు కూడా హాజరయ్యారు. ప్రస్తుత పరిణామాల్లో కేసీఆర్ కూతురు

మిగతా 02లో..



## సీఎం స్టూడెంట్
రేవంత్ రికార్డు

- పుస్తకాలు చేతబట్టి హార్వర్డ్ యూనివర్సిటీ క్లాసులకు..
- '21వ శతాబ్దంలో నాయకత్వం' అంశంపై కోర్సు

02

## కొడంగల్‌కు సమానంగా నల్గొండకు నిధులివ్వండి

- సీఎం రేవంత్ కు మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తి
- వచ్చే ఎన్నికల్లో ఉత్సాహం ఉంటేనే పోటీ చేస్తా

03



## మోడీకే వక్రభాష్యం
దౌత్య సందేశానికే తప్పు అర్థం పెట్టిన ఏఐ

- మోదీ పోస్టుతో మొదలైన వివాదం
- గణతంత్ర దినోత్సవాన్ని స్వాతంత్ర్య దినోత్సవంగా మార్చిన గ్రోక్ అనువాదం

09




## కాంగ్రెస్‌తోనే మా పోటీ

- బీఆర్ఎస్ ను గల్లంతు చేస్తాం
- ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభావం ఉండదు
- నిజామాబాద్ ఎంపీ అర్వింద్

03



**క్రీడా ప్రపంచంలో వింతలు**

లైట్నింగ్ స్ట్రైక్ (1998): కాంగోలో జరిగిన ఒక ఫుట్‌బాల్ మ్యాచ్‌లో పిడుగు పడి ఒక జట్టులోని 11 మంది ఆటగాళ్లు మరణించగా, ప్రత్యర్థి జట్టు వారు మాత్రం సురక్షితంగా బయటపడటం అత్యంత వింతైన ఘటన.



# కవితతోనే కష్టం

- ఫోన్ ట్యాపింగ్ లో బీఆర్ఎస్ అంతర్మథనం
- కవితకు నోటీసులు ఇచ్చే ఛాన్స్
- విచారణకు వెళ్తే గండమే
- హరీష్, సంతోష్ పాత్ర వివరిస్తారని భయం
- ఇప్పటికే ఈ కేసుపై బహిరంగ విమర్శలు
- తన భర్త ఫోన్ ట్యాప్ చేశారన్న కవిత



(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంపీగా, ఎమ్మెల్సీగా ఉన్న కల్వకుంట్ల కవితకు కూడా నోటీసులు ఇస్తారని తెలుస్తోంది. మరో రెండు రోజుల్లో ఆమెకు సిట్ నోటీసులు అందే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని పెంచుతోంది. ఎందుకంటే ఇప్పటికే బీఆర్ఎస్ పై కవిత తిరుగుబాటు చేస్తోంది. కేసీఆర్ మినహా.. కీలక నేతలందరిపైనా విమర్శలు చేస్తోంది. అంతేకాదు.. గతంలో తన భర్త ఫోన్ కూడా ట్యాప్ చేశారంటూ ఆరోపణలు చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో కవిత సిట్ విచారణకు హాజరైతే.. తమకు కొంత ఇబ్బందే అంటూ బీఆర్ఎస్ నేతల్లో భయం పట్టుకున్నట్లు చెబుతున్నారు.

**విచారణలో కవిత వైఖరి ఏంటి..?**

త్వరలోనే కవితకు సిట్ నోటీసులు వస్తాయని ప్రచారం. ఒకవేళ కవితకు నోటీసులు జారీ అయితే ఆమె సిట్ ఎదుట ఏ విధంగా స్పందిస్తారన్నది కీలకంగా మారింది. ముఖ్యంగా గతంలో ఆమె చేసిన వ్యాఖ్యలు, సొంత సోదరుడిపై చేసిన ఆరోపణలు ఇప్పుడు మళ్లీ చర్చకు వస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించి ఆమె వద్ద ఉన్న సమాచారం ఏమిటి? విచారణలో ఆమె ఎలాంటి విషయాలు వెల్లడిస్తారు? అన్న ప్రశ్నలు రాజకీయ విశ్లేషకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ అంశం బీఆర్ఎస్ పార్టీ అంతర్గత రాజకీయాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద దుమారం రేపింది. ఇప్పుడు కవితకు నోటీసుల అంశం తెరపైకి రావడంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ కేసు ఎటువైపు దారి తీస్తుందన్నది, తెలంగాణ రాజకీయ భవిష్యత్తుపై కీలక ప్రభావం చూపే అంశంగా మారింది.

**ఇంకా ఎవరెవరు..?**

ఇప్పుడు బీఆర్ఎస్ కీలక నేతలైన హరీశ్‌రావు, కేటీఆర్ సహా ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన సంతోష్ ను విచారణకు పిలిచారు. దీంతో ఇంకా ఎవరెవరికి నోటీసులు ఇస్తారనే డౌట్స్ మొదలయ్యాయి. త్వరలో మాజీ సీఎం, గులాబీ బాస్ కేసీఆర్‌కు కూడా సిట్ నోటీసులు ఇవ్వబోతుందంటున్నారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్సీ కవితకు సిట్ నుంచి పిలుపు రానుందని..ఆమె వాంగ్మూలం రికార్డు చేస్తారని అంటన్నారు. ఆమె స్టేట్‌మెంట్ ఆధారంగా.. మిగతా అధికారులు ఇచ్చిన వివరాలను బేస్ చేసుకుని..కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి సిట్ విచారించే అవకాశం ఉందంటూ గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామాను ఆమోదించాలని శాసనమండలి ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేసిన సందర్భంగా ఇంటల్లుడి ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేస్తారా?.. కేటీఆర్ భార్య ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేస్తే ఆయన ఊరుకుండేవారా? అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయాలని కోరారు. సిట్ ముందు హాజరై వివరాలను అందజేస్తానని కూడా చెప్పారు. ఆమె ఈ కామెంట్లు చేసిన తర్వాతే ప్రభుత్వం సజ్జనార్ ఆధ్వర్యంలో పది మందితో సిట్‌ను ఏర్పాటు చేసింది. ఫోన్ ట్యాపింగ్‌పై కామెంట్లు చేసినందున తగిన ఆధారాలు ఇవ్వాల్సిందిగా ఆమెకు నోటీసులు జారీచేసి ఎంక్వైరీకి పిలిచే అవకాశముందన్న టాక్ వినిపిస్తోంది.

**సిట్‌పైనే బీఆర్ఎస్ అటాక్**

మరోవైపు బీఆర్ఎస్ సిట్‌పైనే అటాక్ చేసింది. రాజకీయ వికృత క్రీడ కోసం రేవంత్ వ్యవస్థను దిగజారుస్తున్నారని మండిపడుతున్నారు. సజ్జనార్‌ను సిట్ చీఫ్‌గా నియమించడంపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సజ్జనార్‌పై 7 కేసులు ఉన్నాయి. ఆయనకు, డీజీపీ శివధర్ రెడ్డికి ఈ కేసు విచారించే నైతిక హక్కు లేదన్నారు. లోతైన విచారణ జరిగితే సజ్జనార్‌పైనే జరగాలనే మాటను తెరపైకి తెచ్చారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో లేనిపోని లింకులు పెడుతున్నారని, లీడర్లకు ట్యాపింగ్‌తో ఎలాంటి సంబంధం లేదని.. రేవంత్ రాజకీయ క్రీడలో పోలీసులు బలికావొద్దని హెచ్చరించారు. కుట్రపూరితంగా, ఉద్దేశపూర్వకంగా తమపై కేసులు పెట్టారని హరీశ్ అటాక్ స్టార్ట్ చేశారు. కావాలనే రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న అధికారులతో సిట్ వేసి తమ మీద ప్రయోగాలు చేస్తున్నారని ఫైరవుతున్నారు. అన్యాయంగా, అక్రమంగా వ్యవహరిస్తే, ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టాలని చూస్తే అధికారులెవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని వార్నింగ్ ఇచ్చారు. చట్టాన్ని అతిక్రమించినా, న్యాయబద్ధంగా వ్యవహరించకపోయినా, తప్పుడు లీకులు ఇచ్చినా ఆ పోలీసులను వదిలిపెట్టే ముచ్చటే లేదని తేల్చి చెబుతున్నారు. అంతకు అంత అనుభవిస్తారు.. జాగ్రత్తగా బిహేవ్ చేయాలని సూచించారు. రిటైర్ అయినా మిమ్మల్ని వదిలిపెట్టమని..ఎక్కడ దాక్కున్నా, సప్త సముద్రాల అవతల ఉన్నా పట్టి కొచ్చి విచారిస్తామని హెచ్చరించారు. అయితే సిట్‌పై బీఆర్ఎస్ విమర్శలకు దిగడం ఆసక్తికర చర్చకు దారితీసింది. సిట్ విచారణ తర్వాత లీకులు..మీడియాలో ఇష్టం వచ్చిన ప్రచారం జరగడంపై ఫైర్ అవుతున్నారు గులాబీ లీడర్లు. నెక్స్ట్ సిట్ నుంచి పిలుపు వచ్చేదెవరికి.? కవిత వాంగ్మూలం రికార్డు చేస్తారా లేదా.? అరెస్టుల పర్వం కూడా స్టార్ట్ కానుందా.? అనేది వేచి చూడాలి




# 'పుర'భేరీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం భావించింది. జీహెచ్ఎంసీ మినహా మిగిలిన చోట్ల ఈ ఎన్నికలు జరుగుతాయి. నామినేషన్ వేయనున్న అభ్యర్థులు నామినేషన్ వేసే లోపు ఆస్తి పన్ను, నల్లా బిల్లు బకాయిలు లేకుండా చూసుకోవాలి. ఫిబ్రవరి 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు ఇచ్చారు. నామినేషన్ల ప్రారంభం నుంచే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం చేసుకోవచ్చు. పోలింగ్ జరిగిన తర్వాత ఎక్కడైనా హింసాత్మకం, అనుకోని సంఘటనలు జరిగితే రీపోలింగ్ చేసేందుకు ఫిబ్రవరి 12న రీపోలింగ్ కు అవకాశం ఇచ్చారు. పోలింగ్ అనంతరం ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఫిబ్రవరి 16వ తేదీన మున్సిపల్ ఛైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక చేయనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఫిబ్రవరి 16వ తేదీన కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరుగుతుంది.ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం హీటెక్కింది. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అన్ని రాజకీయ పార్టీలు గెలుపు కోసం సర్వశక్తులొడ్డుతున్నాయి.

**అమల్లోకి ఎన్నికల కోడ్**

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తక్షణమే రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. అక్రమాలను అరికట్టేందుకు ఫ్లైయింగ్ స్క్వాడ్లు రంగంలోకి దిగాయని ఏడీజీ మహేష్ భగవత్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నగదు రవాణాపై పోలీసులు కఠిన నిబంధనలు విధించారు.. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వ్యక్తులు గరిష్టంగా రూ. 50వేల వరకు మాత్రమే నగదును వెంట తీసుకెళ్లాలి. అంతకంటే ఎక్కువ నగదు ఉంటే తప్పనిసరిగా సరైన ఆధారాలు చూపించాలి, లేని పక్షంలో ఆ నగదును సీజ్ చేస్తారు. పోలీసులు నగదు లేదా ఇతర వస్తువులను సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా రిసీట్ ఇస్తారు. దానిపైనే అప్పీల్ చేసుకునే వివరాలు కూడా ఉంటాయి.

**భద్రతా ఏర్పాట్లు , నిఘా**

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ భారీ ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ పోలీసులతో పాటు ఫారెస్ట్ , ఎక్సైజ్ శాఖల నుంచి సుమారు 2,000 మంది అదనపు సిబ్బందిని వినియోగిస్తున్నారు. పారదర్శకత కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100% వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. హైపర్ సెన్సిటివ్ , క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలతో నిఘా ఉంచుతారు. రౌడీ షీటర్లను బైండోవర్ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఓటర్లందరూ ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, నిర్భయంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల కమిషన్ , పోలీస్ శాఖ విజ్ఞప్తి చేశాయి.

# ఆత్మరక్షణలో బీఆర్ఎస్

- మున్సిపల్ ఎన్నికల భారం లోకల్ లీడర్లపైనే..
- సిట్ విచారణ తో పార్టీలో భయం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో మున్సిపాలిటీ, కార్పొరేషన్లకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఎన్నిక సంగతి ఎలా ఉన్నా.. బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం రాజకీయ ఆత్మరక్షణలో పడినట్లు చర్చ జరుగుతోంది. పార్టీ అగ్రనేతలు ఫోన్ ట్యాపింగ్ కేసులు, సిట్ విచారణలతో సతమతమవుతున్నారు. హరీష్ రావు, కేటీఆర్, సంతోష్ విచారణను ఎదుర్కొన్నారు. ఇటు నేడో, రేపో కల్వకుంట్ల కుటుంబం నుంచి కవిత కూడా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటి వరకు ముగ్గురు విచారణకు వెళ్లినా ఏం చెప్పారనేది పక్కనపెడితే.. కవిత మాత్రం కీలక విషయాలు సిట్ ముందుకు తీసుకువచ్చే ప్రమాదం ఉంది. ఆ తర్వాత కేసీఆర్ కు నోటీసులు ఇస్తారని టాక్. ఇలాంటి అనిశ్చితి వల్ల క్షేత్రస్థాయి కార్యకర్తల్లో కూడా కొంత అయోమయం నెలకొంది. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఆశాజనకంగా లేకపోతే బీఆర్ఎస్ ఇక ముందు భారీ నష్టాన్నే చూడాల్సి వస్తోంది. ఈ పరిణామాల్లోనే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రణాళికాబద్ధంగా ఉండగా.. బీఆర్ఎస్ కిందిస్థాయి నేతలకే బాధ్యతలిచ్చింది. దీంతో బీఆర్ఎస్ ఫలితాలపై పెద్దగా ఆశలు పెట్టుకోలేదన్న వాదన వినిపిస్తోంది.

మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ రావడంతో.. రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రధాన పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను క్లీన్ స్వీప్ చేయాలనే పట్టుదలతో ఉండగా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మాత్రం ఆత్మరక్షణలో పడినట్లు కనిపిస్తోంది.

**రేవంత్ మార్క్ ప్లానింగ్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో లీడర్‌షిప్ ప్రోగ్రామ్ కోసం వెళ్లే ముందే ఆయన పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. మంత్రులను పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా ఇంచార్జులుగా నియమించి, అభ్యర్థుల ఎంపికపై సర్వే నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. జనవరి 31న ఆయన పర్యటన ముగించుకుని తిరిగి రాగానే, పూర్తిస్థాయిలో ఎన్నికల ప్రచార బరిలోకి దిగేలా కాంగ్రెస్ పక్కా ప్రణాళికతో ఉంది.

**ఆత్మరక్షణలో బీఆర్ఎస్.. అగ్రనాయకత్వం ఉక్కిరిబిక్కిరి**

మరోవైపు, బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం క్లూలెస్ స్థితిలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీ అగ్రనేతలు ఫోన్ ట్యాపింగ్ వంటి వరుస కేసులు , సిట్ విచారణలతో సతమతమవుతున్నారు. హరీష్ రావు వంటి కీలక నేతలు విచారణలకు హాజరవుతుండటంతో, ఎన్నికల వ్యూహరచనపై దృష్టి సారించే సమయం వారికి దొరకడం లేదు. ఈ అనిశ్చితి వల్ల క్షేత్రస్థాయి కార్యకర్తల్లో కూడా కొంత అయోమయం నెలకొంది. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఆశాజనకంగా లేకపోతే, దాని బాధ్యతను అగ్రనేతలు మోయాల్సి వస్తుందని బీఆర్ఎస్ భావిస్తోంది. అందుకే ఈసారి బాధ్యతలను కేవలం స్థానిక ఇంచార్జులకే పరిమితం చేసినట్లు తెలుస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇప్పటికే మున్సిపాలిటీల వారీగా ఇంచార్జులను నియమిస్తామని ప్రకటించారు. ఫలితాలు తారుమారైతే అది నాయకత్వ వైఫల్యంగా ముద్ర పడకుండా ఉండేందుకే ఈ సేఫ్ గేమ్ ఆడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రజా క్షేత్రంలో సవాలు**

కాంగ్రెస్ ప్రభుత్వం తన ఆరు గ్యారెంటీల అమలును అస్త్రంగా చేసుకుని ముందుకు వెళ్తుంటే, బీఆర్ఎస్ మాత్రం ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని చూస్తోంది. అయితే, నాయకత్వ స్థాయిలో ఉన్న అడ్డంకులు, విచారణల హోరు మధ్య బీఆర్ఎస్ ఎంతవరకు పుంజుకుంటుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ మున్సిపల్ ఎన్నికలు అటు రేవంత్ రెడ్డి పాలనకు రెఫరెండంగా, ఇటు బీఆర్ఎస్ పార్టీకు పరీక్షగా మారనున్నాయి. ఈ ఎన్నికల్లో పట్టు కోల్పోతే కింది స్థాయిలో పార్టీపై ప్రభావం పడుతుందని రెండు పార్టీలు భావిస్తున్నాయి.

# సమ్మక్క సారలమ్మల చరిత్ర తెలుసా?

**ముద్ర న్యూస్ :**

మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతరకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు మేడారం మహా జాతర వైభవంగా సాగనుంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. అయితే జాతర సమయంలో భారీగా భక్తులు రద్దీ ఉండనుండగా... ఇప్పటికే లక్షలాది మంది మేడారం వచ్చి సమ్మక్కసారలమ్మ గద్దెలను దర్శించుకున్నారు. మేడారం మహాజాతరలో కీలకమైన నాలుగు రోజులు లక్షలాదిగా భక్తులు తరలిరానుండగా... వారికి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం జారతను 8 జోన్లు, 42 సెక్టర్లుగా విభజించి విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. 21 శాఖలకు చెందిన 42,027 మందికి పైగా ఉద్యోగులు, సిబ్బందిని మేడారం విధుల్లో మోహరించింది. మేడారం జాతర ముగిసేవరకు ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. జాతరలో 13వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. అలాగే భక్తుల రద్దీ నేపథ్యంలో ఆర్టీసీ రాష్ట్రంలోని 51 పాయింట్ల నుంచి 4 వేల ప్రత్యేక బస్సులను మేడారంకు నడపనుంది. మొత్తంగా 20 లక్షల మంది భక్తులను సురక్షితంగా జాతరకు చేర్చేందుకు ఆర్టీసీ ప్రణాళికలను రచించింది.

అయితే మేడారం మహా జాతర 2026 వేళ... సమ్మక్కసారలమ్మల చరిత్ర, ఎప్పటి నుంచి ఈ గిరిజన జాతర జరుపుకుంటున్నారు?, జాతర నేపథ్యం వంటి వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం... ములుగు జిల్లాలో తాడ్వాయి మండలం మేడారంలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతర ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పెరుగాంచింది. ఈ జాతరలో వనదేవతలు సమ్మక్కసారలమ్మలు పూజలు అందుకుంటారు. సమ్మక్క దేవతకు సంబంధించి అనేక ఇతిహాసాలు ఉన్నాయి. ఒక గిరిజన కథ ప్రకారం... 13వ శతాబ్దంలో కాకతీయుల పాలన కాలంలో జగిత్యాల జిల్లా ప్రాంతంలోని పొలవాసను గిరిజన దొర మేడరాజు పాలిస్తూ ఉండేవారు. అయితే వేటకు వెళ్లిన కొంతమంది గిరిజన నాయకులు పులుల మధ్య అపారమైన కాంతిని వెదజల్లుతున్న శిశువు(సమ్మక్క)ను కనుగొన్నారు. ఆమెను వారి నివాసానికి తీసుకెళ్లారు. తెగ అధిపతి మేడరాజు ఆమెను దత్తత తీసుకుని పెంచి పెద్ద చేశారు. ఆమె ఈ ప్రాంతంలోని గిరిజనులకు రక్షకురాలిగా మారారు. ఆమెను మేడా రాజు తన మేనల్లుడు, కాకతీయుల సామంత రాజు, మేడారం పాలకుడు అయిన పగిడిద్ద రాజును వివాహం చేసుకున్నారు. సమ్మక్కపగిడిద్ద రాజు దంపతులకు సారలమ్మ, నాగులమ్మ అనే ఇద్దరు కుమార్తెలు... జంపన్న అనే ఒక కుమారుడు జన్మించారు.

# కాలేజీకి వెళుతున్న రేవంత్..

- తొలి సీఎంగా రికార్డ్
- పుస్తకాలు చేతబట్టి హార్వర్డ్ యూనివర్సిటీ క్లాసులకు..
- '21వ శతాబ్దంలో నాయకత్వం' అంశంపై కోర్సు
- 30వ తేదీ దాకా క్లాసులు.. తొలి రోజు హాజరైన సీఎం
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 దాకా తరగతులు
- హార్వర్డ్ నుంచి సర్టిఫికెట్ అందుకోనున్న తొలి సీఎంగా రికార్డు..
- 2న రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి

**ముద్ర, హైదరాబాద్ :**

తెలంగాణ సీఎం రేవంత్ అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం స్టూడెంట్‌గా మారారు. చక్కగా మెడలో ఐడీ కార్డు వేసుకొని.. పుస్తకాలు చేతబట్టి సోమవారం పొద్దుపొద్దున్నే భారీగా కురుస్తున్న మంచు మధ్య వణికించే చలిలో హార్వర్డ్ పరిధిలోని మసాచుసెట్స్‌లోని కెనడీ స్కూల్‌కు వెళ్లారు. అక్కడ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. అప్పట్లో ఫైన్ ఆర్ట్స్ విద్యార్థిగా మూడేళ్లపాటు హైదరాబాద్ జేఎన్‌టీయూలో తరగతులకు హాజరైన రేవంత్, ఇప్పుడు సీఎం హోదాలో రోజుల వ్యవధిలోనే హార్వర్డ్ నుంచి సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేయనున్నారు. ఆ కొన్ని రోజుల్లోనే క్లాసులు విని.. హోంవర్కులు రాసి, అసైన్‌మెంట్‌లు పూర్తిచేసి.. వాటిని క్లాసులో సమర్పించి ప్రఖ్యాత వర్సిటీ నుంచి సర్టిఫికెట్ అందుకోనున్నారు. వర్సిటీ నిర్వహించే "లీడర్‌షిప్ 21 సెంచరీ" అనే కోర్సుకు సంబంధించి కెనడీ స్కూల్ ప్రాంగణంలో క్లాసులు సోమవారం మొదలయ్యాయి. ఈ క్లాసులు 30వ తేదీ వరకు జరుగుతాయి. ఈ కోర్సు కోసం ఐదు ఖండాల నుంచి 20 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారు. వీరందరితో కలిసి సోమవారం మొదలైన క్లాసులకు రేవంత్ హాజరయ్యారు. సీఎం పదవిలో కొనసాగుతూ హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి ఒక కోర్సు సర్టిఫికెట్ అందుకున్న సీఎంగా రేవంత్ రికార్డు సృష్టించనున్నారు. తొలిరోజు పరిచయ కార్యక్రమాల అనంతరం కోర్సులో భాగంగా "అఉధికార విశ్లేషణ.. నాయకత్వం" అంశంపై తొలిసెషన్ ప్రారంభమైంది. ఉదయం ఏడింటికే మొదలైన తరగతులు సాయంత్రం ఆరింటిదాకా కొనసాగాయి. కేస్ అనాలసిస్ సహా వివిధ అంశాలపై తరగతులు, కన్సల్టేటివ్ గ్రూప్‌వర్క్ వంటి కార్యక్రమాల్లో ప్రతినిధులు పాల్గొన్నారు. కోర్సులో భాగంగా ప్రపంచంలోని వివిధ ప్రాంతాలు, కాలాలు, తరాలనుంచి కేస్ స్టడీలను విశ్లేషించి, పరిష్కారాలు రూపొందించి తరగతిలో సమర్పిస్తారు. ఆ తర్వాతే కోర్సు ముగుస్తుంది. ఆపై.. యూనివర్సిటీ నుంచి సీఎం రేవంత్ సర్టిఫికెట్ పొందనున్నారు. అనంతరం ఆయన అమెరికా నుంచి తిరుగు ప్రయాణమవుతారు. ఫిబ్రవరి 2న ఆయన హైదరాబాద్ చేరుకుంటారు. కాగా క్లిష్టమైన పరిస్థితుల్లో ఎలాంటి నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాలి? అనిశ్చిత పరిస్థితులను, అనుకోని మార్పులను ఎలా ఎదుర్కోవాలి? సంబంధించిన అంశాలు కోర్సులో ఉంటాయి. ఇది రాజకీయ నాయకులు, ప్రభుత్వ సీనియర్ అధికారులు, కార్పొరేట్ కంపెనీల సీఈవోలు, డైరెక్టర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ఉపయుక్తంగా ఉంటుంది.






**హార్వర్డ్ విశేషాలు..**

హార్వర్డ్ యూనివర్శిటీ పరిధిలోని ప్రైవేటు ఐవీ లీగ్ పరిశోధన విశ్వవిద్యాలయం మసాచుసెట్స్‌లోని కేంబ్రిడ్జిలో ఉంది. దీనిని 1607లో స్థాపించారు. అంటే దాదాపు 418 ఏళ్ల చరిత్ర కలిగిన యూనివర్శిటీ ఇది. గత వందేళ్లలో దాదాపు 75 సార్లు ప్రపంచంలో నంబర్‌వన్ విశ్వవిద్యాలయంగా నిలిచింది. దీని పరిధిలో 14 కళాశాలలున్నాయి. బిజినెస్ (హెచ్‌బీఎస్), లా (హెచ్‌ఎల్‌ఎస్), మెడికల్, గవర్నమెంట్, థియాలజీ శాస్త్రాలకు విడి విడిగా కళాశాలలు ఉన్నాయి. కాగా కెనడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను 1936లో స్థాపించగా, 1966లో అధ్యక్షుడు కెనడీ పేరును పెట్టారు. స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో దాదాపు 100కు పైగా దేశాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. కాగా ప్రస్తుతం బోస్టన్‌లో భారీ మంచు తుపాను (ఫెర్న్) కారణంగా రెండు అడుగులకు పైగా మంచు కురిసినట్లు సమాచారం. ఉష్ణోగ్రతలు మైనస్ 20 డిగ్రీలకు పడిపోయాయి.

క్రీడా ప్రపంచంలో వింతలు

వరుసగా 20 ఏళ్లు ఓటమి: అమెరికాకు చెందిన 'వాషింగ్టన్ జనరల్స్' అనే బాస్కెట్‌బాల్ జట్టు దాదాపు 2,495 మ్యాచ్‌ల్లో వరుసగా ఓడిపోయి రికార్డు సృష్టించింది.

# సీక్రెట్ కాదు.. బహిరంగమే

- మున్సిపల్ ఎన్నికలపై చర్చించాం
- రాజకీయ లబ్ధి కోసమే అసత్య ప్రచారం
- మంత్రుల భేటీ పై శ్రీధర్ బాబు వివరణ

**ముద్ర, హైదరాబాద్ :**

బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తుల భేటీకి రాజకీయ రంగులు పులుముతూ విష ప్రచారం చేయడం సరికాదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మండిపడ్డారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసంలో మంత్రుల భేటీపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. లోక్ భవన్ నుంచి అందరి ముందే తామంతా ఒకే కారులో వెళ్లామని, అలా బహిరంగంగా వెళ్లినప్పుడు అది రహస్య భేటీ ఎలా అవుతుందని మంత్రి ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన పార్టీ వ్యూహాలపై చర్చించడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశమని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సన్నద్ధత అనేది రాజకీయ పార్టీల ప్రాథమిక బాధ్యత అని, దీనిపై చర్చించుకోవడాన్ని తప్పు పట్టాల్సిన అవసరం లేదని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకే కొందరు కావాలనే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలకు ఒడిగడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



**సమన్వయం కోసమే**

పాలనలో సమన్వయం కోసమే తాము సమావేశమయ్యామని, క్యాబినెట్ అనేది ఒక యూనిట్ లాంటిదని మంత్రి వివరించారు. పాలనాపరమైన అంశాల్లో ఎక్కడా జాప్యం జరగకుండా చూడటం సీనియర్ మంత్రులుగా తమ బాధ్యత అని పేర్కొన్నారు. భట్టి విక్రమార్క నివాసంలో జరిగిన చర్చలన్నీ కేవలం ప్రభుత్వం మరియు పార్టీ సమష్టి బాధ్యతలో భాగమేనని, ఇందులో దాపరికాలు ఏమీ లేవని ఆయన తేల్చి చెప్పారు. నిర్మాణాత్మకమైన విమర్శలను తాము ఎప్పుడూ స్వాగతిస్తామని, అయితే కేవలం ఊహాజనిత కథనాలతో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని శ్రీధర్ బాబు హెచ్చరించారు. భావితరాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని అడ్డుకోకుండా, ఇలాంటి తప్పుడు ప్రచారాలు మానుకుని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

**అసలేం జరిగిందంటే ?**

హైదరాబాద్‌లోని ప్రజా భవన్ లో సోమవారం రాత్రి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తుతం దేశంలో లేని సమయంలో నలుగురు మంత్రులు సమావేశం కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. లోక్‌భవన్‌లో గవర్నర్ నిర్వహించిన 'ఎట్ హోం' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మంత్రులు అక్కడ నుండి నేరుగా ప్రజా భవన్ కు వెళ్లారు. సీఎం రేవంత్ అమెరికాలో లీడర్ షిప్ కోర్సు చేసేందుకు వెళ్లిన సమయంలో మంత్రులు భేటీ కావడంతో ఏదో జరుగుతోందని ప్రచారం ప్రారంభమైంది. దీనిపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కూడా స్పందించారు. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో నలుగురు మంత్రులు సమావేశం కావడంలో ఆశ్చర్యం లేదన్నారు. సీఎం అందుబాటులో లేనప్పుడు పాలనాపరమైన అంశాలపై మంత్రులు చర్చించుకోవడంలో తప్పులేదన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సజావుగా సాగడానికి మంత్రుల మధ్య సమన్వయం అవసరం. అందులో భాగంగానే భట్టితో ముగ్గురు మంత్రులు భేటీ అయ్యారని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై భేటీలో పాల్గొన్న శ్రీధర్ బాబు క్లారిటీ ఇవ్వడంతో ఈ ప్రచారానికి తెరపడినట్లయింది.



# వనదేవతల కృపకు పాత్రులు కావాలి

- మేడారం భక్తులకు సీఎం శుభాకాంక్షలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

నేటి నుంచి ప్రారంభం కానున్న మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు వెళ్లే భక్తులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులు సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకొని అమ్మ వార్ల కృపకు పాత్రులు కావాలని ప్రార్థిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం ప్రకటన విడుదల చేశారు. భక్తులంతా దర్శనానంతరం క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**ప్రజలు సుభిక్షంగా ఉండాలి : మాజీ సీఎం కేసీఆర్**

రాష్ట్రంలో అన్ని రంగాల్లో ప్రగతి తిరిగి పుంజుకొని, ప్రజలు సుభిక్షంగా జీవించేలా దీవించాలని సమ్మక్క సారలమ్మ దేవతలను మాజీ సీఎం కేసీఆర్ ప్రార్థించారు. మేడారం జాతరను పురస్కరించుకుని భక్తులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ త్యాగానికి, ధిక్కారానికి ఆదివాసీ దేవతలు సమ్మక్క సారలమ్మలు ప్రతీకలని కేసీఆర్ అన్నారు. కొంగు బంగారమై, కోరిన కోరికలు తీర్చే తమ ఇలవేల్పులకు మొక్కులు తీర్చుకునేందుకు, కోట్లాదిగా తరలివచ్చే భక్తులతో మేడారం జాతర కుంభమేళాను తలపిస్తూ ఆధ్యాత్మిక కేంద్రమై కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సమాజాల



సబ్బండ కులాల సంస్కృతి, సంప్రదాయాలకు పదేండ్ల బీఆర్ఎస్ పాలన పెద్దపీట వేసిందని కేసీఆర్ పేర్కొన్నారు. గోదావరి లోయ పరీవాహక ప్రగతితో సమాంతరంగా సాగిన ఆధ్యాత్మిక అభివృద్ధిని కేసీఆర్ స్మరించుకున్నారు



# అంతా కట్టుకథే

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సింగరేణిలో అవినీతి విషయంలో ప్రతిపక్ష నేతల ఆరోపణలు అవాస్తవాలే
- మున్సిపల్ ఎన్నికల్లోనూ సత్తా చాటుతాం

**ముద్ర, ఖమ్మం :**

సింగరేణి బొగ్గు టెండర్ల విషయంలో అవినీతి జరిగిందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అవన్నీ ప్రధాన ప్రతిపక్షం అల్లుతున్న కట్టుకథలని పేర్కొన్నారు. ఈ నెల 26న రాత్రి తనతో మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయిన విషయంపై అసత్య ప్రచారం జరుగుతోందన్నారు. పిచ్చోళ్ల మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఖమ్మం పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. తనతో మంత్రులు భేటీ కావడం సాధారణ విషయమేనని చెప్పారు. సమావేశం కాకూడదా? అని ప్రశ్నించారు. పాలనాపరమైన అంశాలపైనే అప్పుడప్పుడు అలా భేటీ అవుతుంటామని స్పష్టత ఇచ్చారు. మంత్రులు సీఎం లేదా డిప్యూటీ సీఎం వద్దకు వెళ్తుంటారన్నారు. సీఎం అందుబాటులో లేనందునే తనతో ఆయా విషయాలపై చర్చించేందుకు మంత్రులు వచ్చారని అన్నారు. తాను, సీఎం, మంత్రులు అంతా సమష్టిగా, ఉమ్మడి కుటుంబంలా పనిచేస్తున్నామని వివరించారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాలే మున్సిపల్ ఎన్నికల్లో రిపీట్ అవుతాయని భట్టి అన్నారు. రాష్ట్రంలోని అన్ని పురపీఠాలపై కాంగ్రెస్ జెండా ఎగురుతుందన్నారు. తమపై ఎవరు ఎలాంటి దుష్ప్రచారం చేసినా.. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే తమ ధ్యేయమని అన్నారు. తెలంగాణను 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీగా నిలిపేందుకు ఎలా ముందుకు వెళ్లాలన్నదే తమ ఆలోచన అని, ఇతర ఆలోచనలు తమకు లేవని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# గుంపుమేస్త్రీకి ప్రధాన గూఢచారి

- సంతోష్ రావుకు శిక్ష పడుతుందనే నమ్మకం లేదు
- పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగ వద్దు
- దొంగకు కేటీఆర్, హరీశ్ రావు వత్తాసు
- గంజాయి, డ్రగ్స్ ను నిర్మూలిస్తామని చెప్పి కాలయాపన
- రేవంత్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- సౌమ్య కుటుంబానికి జాగృతి అండ
- జాగృతి అధ్యక్షురాలు కవిత

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



గుంపుమేస్త్రీ రేవంత్ రెడ్డికి ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ సంతోష్ రావు ప్రధాన గూఢచారి అని జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. సంతోష్ రావు ను సిట్ పిలవటం మంచిదే.. కానీ అతనికి శిక్ష పడటం అనుమానమేనని అభిప్రాయపడ్డారు. తాను గతంలో చెప్పిన దయ్యాల్లో మొదటి దయ్యమే సంతోష్ అని అన్నారు. ఇంతటి దుర్మార్గుడికి కేటీఆర్, హరీష్‌రావు ఎందుకు వత్తాసు పలుకుతున్నారో అర్థం కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి స్మగ్లర్ల దాడిలో గాయపడి, నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య కుటుంబాన్ని కవిత పరామర్శించారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ... ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు కేసీఆర్ దూరం కావటానికి కారణం సంతోష్ రావు అని ఆరోపించారు. గద్దర్ లాంటి నాయకుడ్ని గంటల తరబడి గేట్ బయటే ఉంచడం, ఈటల లాంటి ముఖ్య నేతలు పార్టీ నుంచి బయటకు రావటానికి కూడా సంతోష్ రావే కారణమని చెప్పారు. కేసీఆర్ ఫార్మ్ హౌస్ లో సగం ఇడ్లి తిన్నారా? పూర్తిగా ఇడ్లి తిన్నారా? అన్న సమాచారాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డికి చేరవేసేది ఆయనే అని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో తన గూఢచారికి శిక్షపడకుండా రేవంత్ రెడ్డి కాపాడుకునే పరిస్థితి ఉందన్నారు. పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా తమ పని తాము చేసి ఇలాంటి వారిని శిక్షిస్తేనే.., తెలంగాణ అమర వీరుల ఆత్మ శాంతిస్తుందని అన్నారు. తాము అధికారంలో వస్తే... రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి లేకుండా చేస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నేతలు... గద్దెనెక్కిన తర్వాత ముఖం చాటేశారన్నారు. గ్రామాల్లో కూడా గంజాయి, డ్రగ్స్ ఫ్రీ గా దొరికే పరిస్థితి దాపురించడం బాధాకరమని అన్నారు. ఒక ఎక్సైజ్ కానిస్టేబుల్ ను చంపే ధైర్యం గంజాయి బ్యాచ్ చేసిందంటే ప్రభుత్వం అంటే వారికి ఏ మాత్రం భయం లేదని స్పష్టమవుతోందన్నారు. స్కూల్ లోకి కూడా గంజాయి, డ్రగ్స్ తీసుకొచ్చి పిల్లలను పాడు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం మత్తు వదిలి డ్రగ్స్, గంజాయి మాఫియా పై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. అలాగే ఎక్సైజ్, ఫారెస్ట్ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలన్నారు. డ్రగ్స్, గంజాయి మహమ్మారిని తరిమికొట్టేందుకు జాగృతి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ తోనే మాకు..పోటీ

- బీఆర్ఎస్ ను గల్లంతు చేస్తాం
- ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభావం ఉండదు
- నిజామాబాద్ ఎంపీ అరవింద్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్ తోనే ప్రధాన పోటీ ఉంటుందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభావం ఉంటుందని తాను అనుకోవడం లేదని వ్యాఖ్యానించారు. తాను, మెదక్ ఎంపీ రఘునందన్ రావు కలిస్తే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గల్లంతు కావడం ఖాయమన్నారు. మంగళవారం ఎంపి రఘునందన్ రావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామన్న ఆయన అన్ని స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు వివరించారు. పోటీ చేసిన అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఏ పార్టీలో అయినా గ్రూపు రాజకీయాలు, విభేదాలు సర్వసాధారణం అని అర్వింత్ అన్నారు. బీఆర్ఎస్‌లో కుటుంబ గొడవ, కాంగ్రెస్‌లో మంత్రుల కొట్లాటలు కళ్ల ముందే కనబడుతున్నాయని చెప్పారు. ఎంపీ రఘునందర్ రావు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల కోసం ఇన్‌చార్జులను ఎప్పుడో రంగంలోకి దించామని అన్నారు. రెండు రోజుల్లో అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పారు. గెలుపు కోసం అందరం కలిసి పనిచేస్తున్నామని వెల్లడించారు.

# విద్యాశాఖ మంత్రినైతే..

- కార్పొరేట్ స్కూళ్లను మూసేస్తా
- రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- కొడంగల్ కు సమానంగా నల్గొండ కు నిధులివ్వాలి
- సీఎం రేవంత్ కు మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తి

**ముద్ర, నల్గొండ :**



రాష్ట్రంలో కార్పొరేట్ స్కూల్స్ పేదలను దోచుకుంటున్నాయని, తానే విద్యాశాఖ మంత్రిని అయితే అలాంటి స్కూల్స్ అన్నింటినీ మూసేస్తా రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నల్గొండ పట్టణంలోని బొట్టుగూడలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యాధునిక వసతులతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌తో సమానంగా నల్గొండకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నల్గొండను అభివృద్ధి పథంలో నడిపించాలన్నదే తన లక్ష్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉత్సాహం ఉంటేనే తాను పోటీ చేస్తానని కోమటిరెడ్డి చెప్పారు. రాష్ట్రంలో కార్పొరేట్ స్కూల్స్ పేదలను దోచుకుంటున్నాయని, ఒకవేళ తానే విద్యాశాఖ మంత్రిని అయితే అలాంటి స్కూల్స్ అన్నింటినీ మూసేస్తా అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా తమ పిల్లలను సర్కార్ స్కూళ్లలో చేర్పించాలని కోరారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తొలి పదేళ్లలో విద్యావ్యవస్థకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. తమ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో దాదాపు రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తుందని అన్నారు.

# ఐదుగురు డీఎస్పీల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన డీజీపీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో డీఎస్పీలకు స్థానచలనం కల్పిస్తూ డీజీపీ శివధర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ ఎస్టాబ్లిష్మెంట్ బోర్డు సిఫార్సుల మేరకు ఈ బదిలీలు చేపట్టినట్లు తెలిపారు. వెంటనే ఈ బదిలీలు అమల్లోకి వస్తుందని, బదిలీ అయిన వారు తక్షణమే విధుల నుంచి రిలీవ్ అయి, నిర్దేశించిన చోటికి వెళ్లి విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో టీజీపీఏ స్టాండ్స్‌లో డీఎస్పీగా, ఇల్లందు ఎస్‌డీపీఓగా విధులు నిర్వహిస్తున్న సారంగపాణిని ఖమ్మం జిల్లా వైరా ఏసీపీగా బదిలీ చేశారు. దీంతో ఆయన ఇల్లందు ఎస్‌డీపీఓ పోస్టింగ్ రద్దయ్యింది. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో డీఎస్పీగా ఉన్న పద్మనాభుల శ్రీనివాస్ ను వైరా ఏసీపీ పోస్టు నుంచి తొలగించి, జీహెచ్ఎంసీ అదనపు ఎస్పీ ఖాళీ పోస్టులోనే కొనసాగించాలని నిర్ణయించారు. ఇంటెలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా ఉన్న వెంకన్న బాబును ఇల్లందు ఎస్‌డీపీఓగా నియమించారు. సైబరాబాద్‌లో ఏసీపీ (ఎస్‌బీ)గా పనిచేస్తున్న ప్రకాశ్‌ను నిజామాబాద్ (టీ) ఏసీపీగా బదిలీ చేశారు. నిజామాబాద్ (టీ) ఏసీపీగా ఉన్న ఎల్ఆర్ వెంకట్ రెడ్డిని హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. వీరంతా విధుల్లో చేరిన తర్వాత సీటీసీ నివేదికలు సమర్పించాలని సూచించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
బుధవారం
28.01.2026
4 వేదిక
Peoples Voice
మీ ముద్ర వేయండి
నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..
మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# గ్లోబల్ చెస్ బోర్డ్‌పై మోదీ మాస్టర్ స్ట్రోక్

అంతర్జాతీయ దౌత్యం అంటే కేవలం కరచాలనాలు, విందులు మాత్రమే కాదు.. అది దేశ ప్రయోజనాల కోసం విసిరే వ్యూహాత్మక పాచికల ఆట. తాజాగా భారత్–యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఈ సత్యాన్ని మరోసారి చాటిచెప్పింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తరుణంలో అగ్రరాజ్యపు అహంకారపూరిత ధోరణులకు తలొగ్గకుండా అటు రష్యా స్నేహాన్ని వదులుకోకుండా భారత్ సాధించిన ఈ విజయం ప్రధాని మోదీ దౌత్య ప్రతిభకు నిదర్శనం.

**పాత సంకెళ్లు తెంచుకున్న వాణిజ్యం**

దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఈ ఒప్పందం కొలిక్కి రావడం అనేది ఒక సాధారణ వాణిజ్య పరిణామం కాదు. గ్రీన్‌లాండ్ అంశంపై అమెరికా–ఐరోపాల మధ్య పెరుగుతున్న దూరాన్ని భారత్ తనకు అనుకూలంగా మలుచుకుంది. ఒకవైపు ఉక్రెయిన్ యుద్ధం సాకుతో రష్యా నుంచి చమురు కొనవద్దని అమెరికా ఒత్తిడి చేస్తున్నా భారత్ తన జాతీయ ప్రయోజనాలకే పెద్దపీట వేసింది. ఈయూతో కుదుర్చుకున్న ఈ డీల్ ద్వారా అమెరికాకు ఒక స్పష్టమైన సందేశం అందింది. "భారత్ ఎవరికీ సామంతుడు కాదు.. అది స్వతంత్ర శక్తి."

**ఎగుమతులకు రెక్కలు.. వినియోగదారులకు పండుగ**

ఈ ఒప్పందంలోని గణాంకాలు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోయనున్నాయి. భారత్‌కు దిగుమతయ్యే లగ్జరీ కార్లపై సుంకాన్ని 110% నుండి ఏకంగా 40%కి తగ్గించడం విశేషం. ఇది భవిష్యత్తులో 10%కి చేరితే మెర్సిడెజ్, బిఎండబ్ల్యూ వంటి వాహనాలు సామాన్య ధరకు దగ్గరవుతాయి. వస్త్ర, తోలు, రత్నాల పరిశ్రమలకు ఈయూ మార్కెట్ తలుపులు బార్లా తెరుచుకున్నాయి. భారతీయ కార్మికులకు ఐరోపాలో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఇప్పటికే భారత్ ఐరోపాతో సుమారు 15 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులులో ఉంది. ఈ ఎఫ్‌టీఏతో అది మరింత పెరిగి దేశ విదేశీ మారక నిల్వలను బలోపేతం చేస్తుంది.

**వ్యూహాత్మక భద్రత: 'సేఫ్' అడుగు**

కేవలం వ్యాపారమే కాదు, రక్షణ రంగంలోనూ భారత్ తన పట్టును పెంచుకుంది. 27 దేశాలతో కూడిన 'సెక్యూరిటీ యాక్షన్ ఫర్ యూరప్ (ఎస్.ఏ.ఎఫ్.ఈ)' ప్రోగ్రామ్‌లో భాగస్వామి కావడం ద్వారా ఐరోపా రక్షణ మార్కెట్లోకి భారతీయ కంపెనీలు అడుగుపెట్టే అవకాశం కలిగింది. ఇది మేక్ ఇన్ ఇండియా నినాదానికి అంతర్జాతీయ గుర్తింపును తెస్తుంది.



**భారత్.. ఒక గ్లోబల్ బ్రిడ్జ్**

అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ విమర్శలు గానీ, నాటో చీఫ్ హెచ్చరికలు గానీ భారత్ వేగాన్ని ఆపలేకపోయాయి. ప్రపంచ జీడీపీలో 25 శాతానికి ప్రాతినిధ్యం వహించే ఈ ఒప్పందం, ఆధునిక ప్రపంచ క్రమంలో భారత్ పోషిస్తున్న 'బ్యాలెన్సింగ్ యాక్ట్'కు అద్దం పడుతోంది. ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్' విధానంతో ముందుకు వెళ్తుంటే మోదీ 'భారత్ ఫస్ట్' నినాదంతో ప్రపంచ వేదికపై అగ్రరాజ్యానికి గట్టి సవాల్ విసిరారు. ఇది కేవలం ఆర్థిక విజయమే కాదు, భారత ఆత్మగౌరవ పతాకాన్ని ఐరోపా గడ్డపై ఎగురవేసిన అరుదైన దౌత్య విజయం.

- నరేష్, అసిస్టెంట్ ఎడిటర్, ముద్ర

---

# ప్రజాస్వామ్యానికి పునాది ఓటు



నేదునూరి కనకయ్య
అధ్యక్షుడు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
9440245771

ఒక వ్యక్తి కున్న ఓటు ప్రభుత్వాల నిర్ణయాన్ని ప్రభావితం చేసే సాధనం. సామాజిక 'ఆర్థిక 'రాజకీయ మార్పుకు ఓటే సాధనం .

**ఓటింగ్ రాజ్యాంగ బాధ్యత**

ఓటర్లు అందరు సకాలములో ఓటింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటు వెయ్యాలి. ఓటింగులో పాల్గొనడం ప్రతి ఓటరు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక బాధ్యత. ఓటరుగా నమోదైన ప్రతి వ్యక్తి ఓటింగ్ లో తప్పని సరిగా పాల్గొనాలి. ఓటు వేసి తన సార్వభౌమాధికారాన్ని వినియోగించుకోవాలి. ఓటర్లు ఇతర ఓటర్లను కూడా ఓటు వేసే విధంగా ప్రభావితం చేయాలి. దేశంలో ఓటింగ్ ప్రజాస్వామ్యం పటిష్టతకు ముఖ్య సాధన ఓటర్లు తమ అభిప్రాయాలు చేయడానికి తెలియజేయడానికి ఓటింగ్ సరైన విధానం .

**ఓటరు ఆలోచించాలి**

ఓటు ఎవరికి వేయాలి? ఎందుకు వేయాలి? ఏమిచేస్తారని వేయాలి? అన్న ప్రశ్నలకు సమాధానం పట్ల ఆసక్తి గల ఓటరు ఆలోచించాలి . ఎన్నుకోబోయే పార్టీ / అభ్యర్థి రాష్ట్ర ప్రజల భవిష్యత్ తరాలకు కావలసిన జీవన నాణ్యతను నిర్ణయించే శక్తి సామర్థ్యాలు ఉన్న అభ్యర్థిని ఎన్నుకోవాలి.

**పట్టణ యువత పాల్గొనాలి**

పట్టణ ప్రాంత ప్రజలు యువత పోలింగ్ రోజును సెలవు దినంగా పాటించకూడదు.తమ తల రాతను మార్చే శాసన కర్తలను ఎన్నుకునే దినం రాష్ట్ర ప్రగతి పురోగతికి పాటు పడే సుస్థిర ప్రభుత్వ ఏర్పాటు దినంగా ఓటర్లు బావించాలి.ఓటు పోయేకపోవడం వల్ల మీ గొంతును మీరు వదులుకోవడమే. మీరు ఓటు వేయకపోతే మీకోసం మరొకరు నిర్ణయం తీసుకుంటారు. అవినీతి పరులు నేర చరితులు రాజ్యమేలే అవకాశం కలిగించవద్దు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి 'ఆర్థిక ప్రగతి ప్రయోజనాలు చెకూర్చే సామర్థ్యం వున్న అభ్యర్థులకు ఓటు ద్వారా మద్దతు ఇవ్వాలి.

**ఎన్నికలే మార్పునకుఅవకాశం**

ప్రజాస్వామ్యంలో మార్పు కోసం ఎన్నికలే ఓటర్లకు ఉన్న గొప్ప అవకాశం. ప్రతి వయోజనులు ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి. పోలింగ్ జరిగే ప్రదేశానికి సకాలంలో వెళ్లాలి.ఓటు వేయడంసామాజిక.రాజకీయ హక్కు రక్షణగా భావించాలి. ఓటరుకు మాత్రమే పనికిమాలిన ప్రభుత్వాలను మార్చే శక్తి ఉంది. ప్రతి ఓటరు ఓటు వేయడం కర్తవ్యంగా భావించాలి. ఓటు వేయడానికి ప్రేరేపించాలి. ఆర్థిక ప్రలోభాలకు ఒత్తిడి కి లొంగ కూడదు.అభ్యర్థి చేసే ఒత్తిడి మాయ మాటలు నమ్మకూడదు. ఓటర్లు ప్రజలకు సేవ చేస్తున్న వారిని మాత్రమే ఎన్నుకోవాలి. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి పెట్టుబడుల సమీకరణక ఆదాయ కల్పనకు 'ఉపాధి కల్పన మహిళా 'యువత సాధికారిత సామర్థ్యం ఉన్న పార్టీని /అభ్యర్థులను మాత్రమే ఎన్నుకోవాలి. ఓటుతో ఆర్థిక ప్రగతికి చోటు ఇవ్వాలి. ప్రజలకు పనిచేసే అభ్యర్థిని మాత్రమే ఎన్నుకోవాలి. అభ్యర్థి కులం మతం లేదా ప్రాంతం ఆధారంగా ఓటు వేయకూడదు. ప్రజలకు నమ్మకంగా పనిచేసే నీతి నిజాయితీగా అభ్యర్థిని ఎన్నుకోవాలి. ఎన్నుకున్న తప్పుడు ప్రభుత్వం మన రాష్ట్రాన్ని ప్రజలను సమస్యల్లోకి నెట్టివేస్తుంది. ఓటర్ గాఢ నిద్ర నుండి మేల్కొని ఉత్తమ అభ్యర్థులకు ఓటు వేయాలి. ఓటు తప్పనిసరిగా వేసి అవినీతి నాయకుల నుండి రాష్ట్రాన్ని రక్షించాలి. ఓటర్లు ఎన్నికల సమయంలో మని మద్యం మజిల్ పవర్ కు భయపడకుండా ఓటు వేయాలి.

**మార్పు కోసం ప్రతిజ్ఞ**

మార్పు కోసంఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయాలి. ప్రతి ఓటరు ఓటింగ్లో పాల్గొనడం ద్వారా రాజ్యాంగం కల్పించిన హక్కును వినియోగించుకోవాలి. మార్పు



కోసం ఓటును వినియోగించుకోవాలి. ఓటర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రజాస్వామ్య రక్షణకు తమ ఓటునుహక్కును పెట్టుబడిగా పెట్టాలి. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు చేసిన వాగ్దానాలను మేనిఫెస్టోలను అమలు తీరును పరిశీలించాలి. రాష్ట్ర భవిష్యత్తు రాబోయేప్రభుత్వ చేతుల్లోనే ఉంటుంది కాబట్టి అవినీతి రహిత పేదరిక రహిత నిరుద్యోగ రహిత రాష్ట్ర ఆవిర్భావానికి నిజాయితీగల అభ్యర్థులకు ఓటర్లు మద్దతు పలకాలి. రాష్ట్రాన్ని ప్రగతిశీల రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేయాలి. ఓటు మార్పుకు సాధనం ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై అసంతృప్తిని వ్యక్తం చేయడానికి ఓటింగ్ అత్యంత ప్రభావంతమై నటువంటి మార్గం. ఓటింగు పౌరుల సమిష్టి స్వరం ప్రతిబింబిస్తుంది. విజ్ఞతతో వేసే ఓటు సమాజములో గణనీయమైన సామాజిక ఆర్థిక రాజకీయ మార్పులను తీసుకొస్తుంది. ఓటు ప్రభుత్వాలను నడిపించే శక్తిని కలిగి ఉంది. చారిత్రకంగా చూస్తే ఓటు ప్రభుత్వాలను మార్చివేసింది.

**ఓటు వేయడం పౌరబాధ్యత**

ఓటర్లు మేల్కొవాలి ప్రగతి శీల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి.

---

# లేవరా తెలుగోడా!

లేవరా తెలుగోడా —— లేపరా తెలుగోళ్ళా,
చిమ్మరా తేనెచుక్కలూ – చల్లరా సుమగంధాలూ!
తల్లిమాటే తారకమంత్రంరా —— తల్లిభాషే జీవనయంత్రంరా,
తెలుగుతల్లి పిలుపే శ్వాసగా —— తెలుగుజాతిని మేల్కొలుపురా!

లేవరా... లేచిరా —— తెలుగు వెలుగులు విరజిమ్మరా,
లేవరా... లేచిరా —— తల్లిభాషకు తిలకం దిద్దరా!

అమ్మ ఒడిలో అక్షరదీపం, తాత ఎదలో జ్ఞాన సంగీతం,
పల్లె గాలిలో పూల పరిమళం, తెలుగు మాటలే రవితేజం!
నీ పలుకులు పతాకాలై, నీ అక్షరాలు ఆయుధాలై,
జాతి నుదుట దివ్యజ్యోతై, నడవరా నీవే మార్గదర్శివై!

లేవరా... లేచిరా —— తెలుగు వెలుగులు విరజిమ్మరా,
లేవరా... లేచిరా —— తల్లిభాషను విశ్వవ్యాప్తం చేయ్యరా!

పుస్తకాలే మన సైన్యం, సంస్కృతే మన పరాక్రమం,
సాహిత్యమే మన సింహాసనం, సంస్కృతే మన స్వరాజ్యం!
నెత్తినరుద్దినభాషలకు భయపడకురా, పరభాషాపొంగులకు కలవరపడకురా,
నీ గళమే జాతికి ప్రకాశంరా, నీ గానమే గెలుపుకు ఆధారంరా!

లేవరా... లేచిరా —— తెలుగు వెలుగులు విరజిమ్మరా,
లేవరా... లేచిరా —— తెలుగుజాతి గర్వం చాటరా!

రారా తెలుగోడా —— తల్లి మాటను తలల నింపరా,
యువత నుదుట తిలకం దిద్దరా, భాష భవితకు ముద్ర వేయరా!
గోదావరీ తీరానా – తెలుగును గలగలా పారించరా,
కృష్ణానదీ పక్కలా – తెలుగు సాహితిని వర్ధిల్లజేయరా!

లేవరా... లేచిరా – తెలుగు వెలుగులు విరజిమ్మరా,
లేవరా... లేచిరా – తెలుగు గళమును వినిపించరా!



గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం

---

# ఓవర్ థింకింగ్

ఈ ప్రపంచంలో చాలామంది అతిగా ఆలోచించడాన్ని ఒక సాధారణ అలవాటుగానే భావిస్తారు. కానీ సైకాలజీ ప్రకారం, ఓవర్ థింకింగ్ అనేది మానసిక ఆరోగ్యాన్ని మెల్లగా క్షీణింపజేసే ప్రమాదకరమైన అలవాటు. ఎక్కువగా ఆలోచించే వ్యక్తులు ప్రతి విషయాన్ని లోతుగా విశ్లేషిస్తూ, చిన్న తప్పు కూడా జరగకూడదనే భయంతో జీవిస్తుంటారు. ఈ విశ్లేషణాత్మక స్వభావం ఒకవైపు తెలివిగా కనిపించినా, మరోవైపు తీవ్రమైన మానసిక ఒత్తిడికి దారితీస్తుంది.

మానసిక నిపుణుల ప్రకారం, ఓవర్ థింకింగ్ వెనుక భయం, ఆందోళన ప్రధాన కారణాలు. గతంలో ఎదురైన అపజయాలు లేదా చేదు అనుభవాలు మళ్లీ జరగకూడదనే ఉద్దేశంతో మెదడు ప్రతి విషయాన్ని పదే పదే తిప్పి చూస్తుంది. అయితే ఇదే ప్రక్రియ చివరికి 'అనాలిసిస్ పెరాలిసిస్'గా మారి, నిర్ణయాలు తీసుకోలేని స్థితికి నెట్టేస్తుంది. ఫలితంగా మంచి అవకాశాలు చేజారిపోతాయి, ఆత్మవిశ్వాసం తగ్గిపోతుంది.

ఆలోచించడం అవసరమే కానీ, అతిగా మారితే మనశ్శాంతి కరువవుతుంది. ఓవర్ థింకింగ్ నుంచి బయటపడాలంటే వర్తమానంలో జీవించడం అలవాటు చేసుకోవాలి. చిన్న తప్పులను అంగీకరించి ముందుకు సాగడమే నిజమైన పరిష్కారం.

---

# సెలబ్రిటీలు సంయమనం పాటించాలి



సెలబ్రిటీలు వ్యక్తిగతంగా చేసే పనులు, చెప్పే మాటలు ఈ రోజుల్లో క్షణాల్లోనే సమాజపు చర్చగా మారుతున్నాయి. అభిప్రాయ స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉన్నా, అదే సమయంలో సామాజిక బాధ్యత కూడా ఉండాలన్న సత్యాన్ని మర్చిపోకూడదు. అభిమానమా, అతిశయమా అనే గీత ఎక్కడ దాటుతోంది అన్నదే అసలు ప్రశ్న. వ్యక్తులను దేవతలుగా మలచడం ఆరోగ్యకరమైన పరిణామం కాదు. భావోద్వేగాలకంటే వివేకమే సమాజానికి దారి చూపాలి. సెలబ్రిటీలు తమ ప్రభావాన్ని గుర్తించి సంయమనం పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

---

# ఒకే దేశం రెండు చట్టాలు?

వెంకగారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
9848559863



భారతదేశం వలసవాద సంకెళ్లను తెంచుకుని, సార్వభౌమత్వ దేశంగా అవతరించిన వేళ దేశ ప్రజలందరికీ సమానత్వం, సౌభ్రాతృత్వం సిద్ధిస్తాయని రాజ్యాంగ నిర్మాతలు కలలు కన్నారు. కానీ స్వతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, నేటికీ క్షేత్రస్థాయిలో సామాన్యుడికి ఎదురవుతున్న అనుభవాలు ఆ కలలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. చట్టం ముందు అందరూ సమానమని రాజ్యాంగం ప్రవచిస్తున్నా, అది ఆచరణలోకి వచ్చేసరికి నిందితుడి సామాజిక హోదాను, రాజకీయ పలుకుబడిని బట్టి తన రూపాన్ని మార్చుకుంటోంది. ఈ దేశంలో సామాన్యుడికి ఒక న్యాయం, రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉన్న రాజకీయ నాయకులకు మరో న్యాయం, అధికారులకు ఇంకో న్యాయం అమలు కావడం అనేది ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. వ్యవస్థలను రక్షించాల్సిన అధికారులే రాజకీయ యజమానుల కనుసన్నల్లో పనిచేస్తూ, బాధితుల గోడును వినకపోవడం వల్ల సామాన్యుడు వ్యవస్థపై నమ్మకాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. చట్టం అందరికీ సమానంగా లేనప్పుడు మనకు నిజమైన స్వతంత్రం వచ్చిందని ఎలా అనుకోగలం? సామాన్యుడికి సమాన హక్కులు కేవలం కాగితాల మీద కనిపిస్తున్నాయే తప్ప క్షేత్రస్థాయిలో ఎక్కడ ఉన్నాయనేది నేటికీ జవాబు లేని ప్రశ్న. ఇదేనా మనం ఆశించిన ప్రజాస్వామ్య దేశం?

**అధికార గర్వం - అణగారిన వర్గాల ఆత్మఘోష**

నేటికీ దళితులు మరియు గిరిజనులపై జరుగుతున్న అమానవీయ దాడులు మన నాగరికతకు మాయని మచ్చగా మిగిలాయి. కేవలం ఆత్మగౌరవం కోసం పోరాడాడనో, లేదా సమాజంలో సమానంగా బతకాలని ఆశించాడనో అణగారిన వర్గాల మీద దాడులు చేయడం, వారిని సామాజికంగా బహిష్కరించడం వంటి ఉదంతాలు నిత్యం వార్తల్లో కనిపిస్తూనే ఉన్నాయి. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు రక్షణ కవచంలా నిలవాల్సిన పోలీస్ యంత్రాంగం, తరచుగా అధికార పార్టీల లేదా స్థానిక బలవంతుల ఒత్తిళ్లకు తలొగ్గి నేరస్థులకు కొమ్ముకాస్తోంది. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేయడంలో జాప్యం చేయడం, రాజకీయ ఒత్తులకు తలొగ్గి నిందితులను అరెస్ట్ చేయకపోవడం లేదా విచారణను నీరుగార్చి నిందితులకు వెసులుబాటు కల్పించడం వంటి చర్యలు చట్టం యొక్క పవిత్రతను దెబ్బతీస్తున్నాయి. అధికారుల బదిలీలు, పదోన్నతులు రాజకీయ నాయకుల చేతుల్లో ఉండటం వల్ల, నిజాయితీ గల అధికారులు సైతం తమ గొంతును నొక్కుకుని పాలకుల అజెండాను అమలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి చట్టం పనిచేయనప్పుడు అది ప్రజాస్వామ్యానికే ప్రమాదంగా మారుతుంది. చట్టం తన పని తాను చేయనప్పుడు ఆ దేశంలో స్వతంత్రం కేవలం కాగితాలకే పరిమితం అవుతుంది.

**మార్పు ఎక్కడ రావాలి?- పరిష్కార మార్గాలు**

న్యాయం కేవలం మాటల్లో కాకుండా చేతల్లో కనిపించాలంటే వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు రావాలి. మొదటగా పోలీసు స్వయంప్రతిపత్తి అత్యంత కీలకం. పోలీసు వ్యవస్థపై రాజకీయ జోక్యం లేకుండా 'పోలీసు సంస్కరణలు' తక్షణమే అమలు చేయాలి. అప్పుడే అధికారులు ఎవరికీ భయపడకుండా నేరస్థులను చట్టం ముందు నిలబెట్టగలరు. అదేవిధంగా, దళితులు మరియు గిరిజనులపై జరిగే దాడుల విషయంలో త్వరితగతిన విచారణ జరగాలి. దీనికోసం ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, కేవలం ఏడాదిలోపే తీర్పు వచ్చేలా చట్టపరమైన కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. శిక్ష పడటంలో జరిగే ఆలస్యం నేరగాళ్లలో భయాన్ని పోగొడుతోంది, కాబట్టి వేగవంతమైన న్యాయం నేరాల నియంత్రణకు మొదటి మెట్టు కావాలి. అయితే, కేవలం చట్టం శిక్షలు మాత్రమే సమాజంలో పూర్తి మార్పు తీసుకురాలేవు. దీనికి సామాజిక బాధ్యత కూడా తోడవాలి. కుల వివక్షకు వ్యతిరేకంగా సమాజంలో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆలోచనా దృక్పథంలో మార్పు రావాలి. చదువుకున్న యువత మరియు సామాజిక కార్యకర్తలు వివక్షకు వ్యతిరేకంగా చైతన్యం తీసుకురావాలి.



**సమానత్వమే అసలైన గణతంత్రం**

ఈ దేశంలో నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే చట్టం అనేది రాజకీయ నాయకులకు మరియు సామాన్య ప్రజలకు సమా నంగా ఉండాలి. రాజకీయ నాయకులకు ఒక న్యాయం, సామాన్య ప్రజలకు మరో న్యాయం అనే ద్వంద్వ నీతి నశించినప్పుడే రాజ్యాంగ ఆశయాలు నెరవేరుతాయి. నేర స్థుడు ఏ పదవిలో ఉన్నా, ఎంతటి రాజకీయ బలగం ఉన్నా చట్టం తన పని తాను నిష్పక్షపాతంగా చేసుకుపోవాలి. బాధితుడు ఏ సామాజిక వర్గానికి చెందినవాడైనా అతనికి అందాల్సిన న్యాయం రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా, వేగంగా అందాలి. పో లీసులు పాలకుల కనుసన్నల్లో కాకుండా రాజ్యాంగం పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించినప్పుడే వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. ఎప్పుడైతే ఒక సామాన్య పౌరుడు తన హక్కుల కోసం భయం లేకుండా పోరాడగలుగుతాడో, ఎప్పుడైతే చట్టం నిందితుడి హోదాను చూడకుండా అతను చేసిన నేరాన్ని మాత్రమే చూసి శిక్షిస్తుందో, అప్పుడు అందరికీ నిజమైన స్వతంత్రం వచ్చినట్టు భావించొచ్చు. చట్టం ముందు అందరూ స మానమే అన్న సూత్రం మాటల్లో కాకుండా చేతల్లో కనిపించినప్పుడే ఈ దేశానికి, ప్రజాస్వామ్యానికి నిజమైన గౌరవం దక్కుతుంది. ఇదే మన అసలైన గణతంత్రం మరియు మనం చెప్పుకోదగ్గ నిజమైన గణతంత్ర శుభాకాంక్షలు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
28.01.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### క్రీడా ప్రపంచంలో వింతలు

కుక్క గోల్ కొట్టడం: అర్జెంటీనాలో ఒక ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతుండగా, మైదానంలోకి వచ్చిన ఒక కుక్క బంతిని అడ్డుకుని గోల్ కాకుండా ఆపి వార్తల్లో నిలిచింది.



# మున్సిపల్ ఎన్నికలకు సమగ్ర ఏర్పాట్లు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ముద్ర, వనపర్తి :**

మున్సిపల్ సాధారణ ఎన్నికలు పకడ్బందీగా, పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. మంగళవారం ఎన్నికల నోటిఫికేషన్ జారీకి ముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. జనవరి 28 నుంచి 30 వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని, 31న స్క్రూటినీ నిర్వహించి అర్హత గల నామినేషన్ల జాబితా విడుదల చేస్తారని తెలిపారు. ఫిబ్రవరి 1న ఆర్డీఓకు అప్పీల్ అవకాశం, 2న అప్పీళ్ల పరిష్కారం, 3న మధ్యాహ్నం 3.00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు, అదే రోజు సాయంత్రానికి తుదిజాబితా విడుదల చేస్తారని వెల్లడించారు.

**ఫిబ్రవరి 11న పోలింగ్.. 13న ఓట్ల లెక్కింపు..**

ఫిబ్రవరి 11న ఉదయం 7.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపడతామని షెడ్యూల్ ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. 80వార్డులకుగాను 6ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. పోలీసు శాఖ సహకారంతో ఎన్నికల నియమ నిబంధనల మేరకు ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.






**ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి..**

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. 27న షెడ్యూల్ విడుదలైనందున వెంటనే ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని తెలిపారు. 24గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాంగణాల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, క్యాలెండర్లు, గోడలపై రాతలు తొలగించాలని, విగ్రహాలకు తొడుగులు వేయాలని ఆదేశించారు. 48గంటల్లో పబ్లిక్ స్థలాల్లో, 72గంటల్లో ప్రైవేట్ స్థలాల్లో ఫ్లెక్సీలు తొలగించాలని సూచించారు. 28న ఉదయం 10గంటలకు రిటర్నింగ్ కార్యాలయాల్లో ఫారం1 విడుదల చేసి 10.30 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో కొత్త అభివృద్ధి పనులు చేపట్టరాదని, నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ యాదయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీపీఓ రఘునాథ్ రెడ్డి, సీపీఓ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# తల్లి మాటే కుటుంబ భద్రతకు కవచం

- ప్రమాదాల నివారణకు మహిళల సహకారం అవసరం
- ఎస్పీ సునీత రెడ్డి

**ముద్ర, వనపర్తి :**



రోడ్డు ప్రమాదాల నివారణలో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఐపీఎస్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అలైవ్‌అరైవ్" కార్యక్రమంలో భాగంగా.. పెద్దమందడి మండల కేంద్రంలోని రైతువేదికలో అయ్యప్ప రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలు, పాత్రికేయులు, పోలీస్ సిబ్బందికి హెల్మెట్ ప్రాముఖ్యత, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం ఫౌండేషన్ సహకారంతో 65 హెల్మెట్లను మహిళలు, పాత్రికేయులు, పోలీసులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కుటుంబంలోని పిల్లలు, భర్తలు, అన్నదమ్ములు సురక్షితంగా ఇంటికి చేరాలంటే మహిళలు హెల్మెట్ వినియోగంపై నిరంతరం గుర్తుచేయాలని అన్నారు. హెల్మెట్ ధరించడం చట్టపరమైన నిబంధన మాత్రమే కాకుండా కుటుంబ ఆనందాన్ని కాపాడే భద్రతా కవచమని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామ స్థాయిలో రోడ్డు భద్రత సందేశాన్ని విస్తరించి, సమాజాన్ని ప్రమాదాల నుంచి రక్షించాలని సూచించారు. "అమ్మ మాటలోనే భద్రత ఉంది... భార్య సూచనలోనే భర్త జీవితం ఉంది" అని వ్యాఖ్యానించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకుండా వెళ్లనివ్వడం కుటుంబాన్ని ప్రమాదంలోకి నెట్టినట్టేనని ఆమె హెచ్చరించారు. భర్త బయటకు వెళ్లేటప్పుడు హెల్మెట్ ఉందా అని అడగడం భార్య బాధ్యత అని, పిల్లల భవిష్యత్తును కాపాడేందుకు తల్లి మాటే భద్రత అని తెలిపారు. హెల్మెట్ ధరించమని చెప్పడం ఒక సాధారణ మాట కాదని, కుటుంబ ప్రాణాలను కాపాడే కీలక సూచన అని ఎస్పీ తెలిపారు.



# ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంతో యువకుడి బలి

**ముద్ర, మెహిదీపట్నం :**

ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ యువకుడు నిండు ప్రాణాలు కోల్పోయాడు. లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అత్తాపూర్‌కు చెందిన ముఖేష్ అగర్వాల్ లంగర్ హౌస్ బాపు ఘాట్ సమీపంలో హార్డ్వేర్ దుకాణం నిర్వహిస్తున్నారు. రోజువారీగా తన ఏకైక కుమారుడు ఉమంగ్ అగర్వాల్ (22)తో కలిసి దుకాణానికి వచ్చారు. అనంతరం దుకాణంలో పూజ కోసం సమీపంలోని దేవాలయానికి నీరు తీసుకొచ్చేందుకు ఉమంగ్ ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. దుకాణం నుంచి సుమారు 20 అడుగులు వెళ్లగానే ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును ఎడమ వైపుకు మళ్లించడంతో ఉమంగ్‌ను బస్సు ఢీకొంది. కింద పడిన యువకుడిపై నుంచి బస్సు చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ వెంకటరాములు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆర్టీసీ బస్సును స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై ఆర్టీసీ అధికారులు వివరాలు సేకరించారు.

# బాపూ వర్ధంతి ఏర్పాట్లు సమన్వయంతో పూర్తి చేయాలి

- కలెక్టర్ హరి చందన

**ముద్ర, మెహిదీపట్నం :**

బాపు వర్ధంతి సందర్భంగా ప్రముఖులు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు సమన్వయంతో పూర్తి చేయాలని హైదరాబాద్ కలెక్టర్ హరి చందన అధికారులకు సూచించారు. లంగర్ హౌస్‌లోని బాపు ఘాట్ వద్ద గాంధీ వర్ధంతి కార్యక్రమాల ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో ఆమె సోమవారం అక్కడ పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్‌తోపాటు ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు బాపు సమాధి వద్ద నివాళులు అర్పించి, బాపు ధ్యాన మందిరంలో సర్వమత ప్రార్థనలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాపు ధ్యాన మందిరంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బాపు సమాధి వద్ద నివాళులు అర్పించడం మొదలుకొని ఉదయం 11గంటలకు నిర్వహించే దేశవ్యాప్త సామూహిక మౌనం ముగిసే వరకు అనుమతి లేనివారిని లోపలికి అనుమతించవద్దని ఆదేశించారు. విద్యార్థులకు స్నాక్స్, తాగునీరు అందుబాటులో ఉంచి గతంలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సామూహిక మౌనం కోసం సైరన్ మోగించడం, మౌనం పాటించడం వంటి అంశాలను ముందుగానే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్‌నాయక్, సయ్యద్ ఫయాజ్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# రూ. 80.47కోట్ల రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన

- ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా ప్రారంభం

**ముద్ర, మల్కాజిగిరి :**

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ప్రజల చిరకాల కోరిక నెరవేరనుంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో రూ.80.47 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నేరేడ్మెట్ వాజ్‌పేయి నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి, సఫిల్గుడా సబ్‌వే తదితర రైల్వే అభివృద్ధి పనులకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డితో కలిసి నేరేడ్మెట్ రైల్వే స్టేషన్ వద్ద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే స్పందించి రైల్వే శాఖ ద్వారా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వాజ్‌పేయి నగర్‌నేరేడ్మెట్ రైల్వే అండర్ బ్రిడ్జి, సఫిల్గుడా సబ్‌వే నిర్మాణ పనులను రెండేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. బొల్లారం రైల్వే బ్రిడ్జి, ఎంఎంటీఎస్ రైల్వే లైన్ ప్రాజెక్టులకు కూడా రైల్వే శాఖ ద్వారా నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేసినట్లు వివరించారు. ప్రజల కోసం పనిచేస్తానని, రాజకీయాల్లో వ్యక్తిగత విషయాలకు తావివ్వనని తెలిపారు. ఈ అభివృద్ధి పనులతో ట్రాఫిక్ సమస్యలు తగ్గి, రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి ఎంపీ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఆర్. గోపాలకృష్ణ, అదనపు డీఆర్ఎం కె.ముత్యాల నాయుడు, సీపీఆర్‌వో శ్రీధర్ రావు, డీజీఎం ఉదయ్‌నాథ్‌తోపాటు కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, వి.శ్రవణ్‌కుమార్, మీనా ఉపేందర్ రెడ్డి, సునీత శేఖర్ యాదవ్, దీపిక నరేష్, చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, మేకల సునీత యాదవ్, సబితా కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# కోటిరెడ్డికి 'మోడీ విజన్ ఆఫ్ భారత్' అవార్డు

**ముద్ర, మేడ్చల్ :**

పర్యావరణ పరిరక్షణ కోసం విశేషంగా కృషి చేస్తున్న పర్యావరణ పరిరక్షణ సమితి ఛైర్మెన్ లయన్ కోటిరెడ్డికి 'మోడీ విజన్ ఆఫ్ భారత్' అవార్డు లభించింది. మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లోని వాసవి శ్రీముఖి ఎస్ఎమ్‌వీ గ్రాండ్ హోటల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటిరెడ్డికి 'పీఎం నరేంద్ర మోడీ విజన్ ఆఫ్ భారత్' అవార్డు, సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఈ అవార్డును ప్రముఖ సినీ దర్శకుడు, సాహితీవేత్త, నంది అవార్డు గ్రహీత రేలంగి నర్సింహారావు చేతుల మీదుగా అందజేశారు. పర్యావరణ పరిరక్షణ రంగంలో కోటిరెడ్డి చేస్తున్న సేవలను ఈసందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో మనం ఫౌండేషన్ ఛైర్మెన్ చక్రవర్తి, దుర్గాభవాని, సావిత్రి, సినీ నటుడు జెన్నీ తదితరులు పాల్గొన్నారు.



# ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కుల పంపిణీ

**ముద్ర, కాప్రా :**

ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థులకు హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి చేతుల మీదుగా రూ. 5లక్షల విలువైన చెక్కులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య అనేది సమాజాభివృద్ధికి పునాది అని, ముఖ్యంగా వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకుండా ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని మేయర్ విజయలక్ష్మి తెలిపారు. ఇలాంటి గొప్ప నిర్ణయం తీసుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని ఆమె అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి వైద్యులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, మహేష్‌గౌడ్, రాజు కుమార్, సీతారాం కాలనీ అధ్యక్షుడు రమేశ్‌తోపాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం

- రేవంత్ ప్రభుత్వంపై స్వామి గౌడ్, నిరంజన్ రెడ్డి విమర్శలు

**ముద్ర, వనపర్తి :**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ విముక్తికి కేసీఆర్ కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి ఆంధ్ర పాలకుల తొత్తుగా మారి తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని పిలుపునిచ్చారు. టికెట్ రాని నాయకులు నిరాశ చెందవద్దని, పార్టీ భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు కల్పిస్తుందని స్వామి గౌడ్ భరోసా ఇచ్చారు. 420 హామీలు, 6 గ్యారంటీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మహిళలకు రూ.2,500, ఆసరా పించన్లు రూ.4,000, కళ్యాణలక్ష్మి, తులం బంగారం, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యా భరోసా, రైతులకు రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలను అమలు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ నిర్వహించిన బైక్ ర్యాలీకి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో సర్వేలు, పార్టీ పట్ల విశ్వాసం, విధేయత, కార్యకర్తల ఏకాభిప్రాయానికే ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, కె.మాణిక్యం, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# న్యాయవాదులకు ఉచిత వైద్య శిబిరం

**ముద్ర, కాప్రా :**

మల్కాజిగిరి కోర్టు ప్రాంగణంలో సెవెన్ రా ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది తిప్పారపు కీర్తి కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదుల కోసం ఉచిత మెగా హెల్త్ క్యాంపును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం కుషాయిగూడ కోర్టు ప్రాంగణంలో నిర్వహించగా వందలాది మంది న్యాయవాదులు పాల్గొన్నారు. ఈసందర్భంగా న్యాయవాదులకు షుగర్, బీపీ, హెచ్‌బిఎ1సీ, దంత పరీక్షలు, కంటి పరీక్షలు తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. న్యాయవాదుల ఆరోగ్య పరిరక్షణకు ఈ శిబిరం ఎంతో ఉపయోగపడిందని అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బాపిరెడ్డి, అమరేందర్ రెడ్డి, రాజభక్షి శ్రీనివాస్, అరుణ్ చంద్ర, కె.శ్రావణ్, శివ తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 28-01-2026
www.mudranews.in | @mudranews



### క్రీడా ప్రపంచంలో వింతలు

**ఒకే బంతికి 286 పరుగులు**

1894లో ఆస్ట్రేలియాలో ఒక బ్యాటర్ కొట్టిన బంతి చెట్టు మీద చిక్కుకు పోవడంతో, ఫీల్డర్లు దానిని తీసే లోపు బ్యాటర్లు పరు గెత్తి 286 పరుగులు తీశారని చెబుతుంటారు.



## రంజాన్ మాసం ప్రశాంతంగా జరుపుకునేలా ఏర్పాట్లు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**




**ముద్ర, ఆదిలాబాద్:**
పవిత్ర రంజాన్ మాసాన్ని ఎలాంటి అంతరాయాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రంజాన్ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, మత పెద్దలతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత పవిత్రమైనదని, అందువల్ల అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సహర్, ఇఫ్తార్ సమయాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మసీదుల వద్ద వీధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. మసీదులు, ఈద్గాల పరిసరాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, తాగునీటి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. పండుగ సమయంలో పండ్లు, నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణలో ఉండేలా సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. అధికారులు, మత పెద్దలు సమన్వయంతో రంజాన్ వేడుకలు ఘనంగా, ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు.

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల భాగంగా దేవాలయాలు, మసీదులు, చర్చిలలో 'అరైవ్ అలైవ్' అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, యువత రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ కు దూరంగా ఉండాలని సూచించారు. రాత్రి 11.30 గంటల తర్వాత అనవసరంగా రోడ్లపై తిరగవద్దని, నాయకులు, పెద్దలు యువతకు సూచించాలని కోరారు. అనంతరం పలువురు మత పెద్దలు తమ సూచనలు, సలహాలు తెలియజేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కలీమ్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, మున్సిపల్ కమిషనర్ రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మసీదుల కమిటీ సభ్యులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## వినియోగంలోకి మరిన్ని మున్సిపల్ వాహనాలు

**ముద్ర, కరీంనగర్:**
రానున్న వేసవి సందర్భంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజల తాగునీటి, చెత్త సేకరణ అవసరాలకు మరికొన్ని వాహనాలను కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ వినియోగంలోకి తెచ్చింది. మంగళవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కోర్టు చౌరస్తా వద్ద గల వాటర్ ట్యాంక్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో 35 ట్రాక్టర్లు, 25 ట్రాలీలు, 10 స్వచ్ఛ ఆటోలు, 10 వాటర్ ట్యాంకర్లను వినియోగం లోకి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎస్.ఈ రాజ్ కుమార్, ఈఈ సంజయ్ కుమార్, డీఈ లచ్చిరెడ్డి, ఏఈ బీమ్ వర్ధన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ దిలీప్ కుమార్ ఎంహెచ్ఓ సుమన్ పాల్గొన్నారు.



# రెండేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరీంనగర్ కు చేసింది శూన్యం

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్**



**ముద్ర, కరీంనగర్:**
రెండేళ్ల కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరీంనగర్ కు చేసిన అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం కరీంనగర్ లోని తొమ్మిదవ డివిజన్ బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు స్థానిక డివిజన్ మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. కోతి బొమ్మ చౌరస్తా నుంచి, డివిజన్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జై కేసీఆర్.. జై బిఆర్ఎస్.. కారు గుర్తుకు ఓటేద్దామంటూ.. నినాదాలు చేశారు. అనంతరం కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడారు.

కాంగ్రెస్, బీజేపీ పార్టీ ప్రభుత్వాల పాలనలో తెలంగాణ రాష్ట్రం నలబై, యాబై ఏళ్లు దరిద్రాన్ని అనుభవించిందన్నారు. ఈ రెండేళ్ల కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరీంనగర్ పట్టణానికి రెండు రూపాయలు కూడా తీసుక రాలేదని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన నిధులతో అభివృద్ధి చేస్తూ తామే ఆ నిధులు తీసుకువచ్చినట్టు గొప్పలు చెప్పుకుంటూ ఫోటోలు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. 10 సంవత్సరాల కాలంలో బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి ఏంటో.. రెండేళ్ల కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన విధ్వంసం ఏంటో విజ్ఞులైన ప్రజలు గమనించాలనీ కోరారు. కాంగ్రెస్ బిజెపి పార్టీలకు ఓటేస్తే మళ్లీ 50 ఏళ్లు దరిద్రానికి స్వాగతం పలికనట్టు అవుతుందన్నారు. తెలంగాణ ప్రజల సంక్షేమమే బిఆర్ఎస్ పార్టీకి ముఖ్యమన్నారు. మన పిల్లలు ఉన్నతంగా ఉండాలన్న.. నగరం అన్ని విధాల అభివృద్ధి చెందాలన్నా బిఆర్ఎస్ పార్టీకే ఓటేయాలని ప్రజలను కోరారు. అబద్దాల హామీలతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని విమర్శించారు. ఈ రెండేళ్ల కాలంలో చేయని అభివృద్ధి మూడేళ్లలో ఏం చేస్తారని ప్రశ్నించారు. కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్ పీఠం బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుం టుందని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ ను అన్ని విధాల అభివృద్ధి చేశామని.. మళ్లీ ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి పట్టం కడితే నగరాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరి శంకర్, స్థానిక డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి జంగిలి లత-ఐలెందేర్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు మర్రి భావన-సతీష్, దిండిగాల మహేష్, గందె మాధవి-మహేష్, నలువాల రవీందర్, మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సతీష్, మిడిదొడ్డి నవీన్, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ లో చేరిన 21వ డివిజన్ బీజేపీ ఇంచార్జి కార్తీక్

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో 21వ డివిజన్ బీజేపీ పార్టీ ఇన్చార్జి ముదుంబై కార్తీక్ బిఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



## నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్ల పరిశీలన



**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లకు, కరీంనగర్ జిల్లా చొప్పదండి మున్సిపాలిటీ పరిధిలోని 14 వార్డులకు, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు, హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది.

ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ నోటిఫికేషన్ ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించి డివిజన్ల వారీగా నామినేషన్ల స్వీకరణకు ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. అభ్యర్థులు వచ్చే మార్గం వెళ్లే మార్గం వేరువేరుగా ఉండాలని, నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నామినేషన్లు స్వీకరించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు.



### ఏసీబీకి పట్టుబడిన ఔట్ సోర్సింగ్ ఏఈ



**ముద్ర, ఆదిలాబాద్:**
లంచం తీసుకుంటూ ఔట్ సోర్సింగ్ ఏఈ శ్రీకాంత్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని హౌసింగ్ శాఖలో ఔట్ సోర్సింగ్ ఏఈగా పనిచేస్తున్న శ్రీకాంత్ రూ.10,000 లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. నార్నూర్ లోని ఇందిరమ్మ ఇంటికి సంబంధించిన ఫొటోలను ఆన్ లైన్ లో అప్డేట్ చేయడానికి ఏఈ శ్రీకాంత్ లబ్ధిదారుల వద్ద నుంచి రూ.20,000 డిమాండ్ చేశాడు. దీంతో లబ్ధిదారులు ఏసీబీని ఆశ్రయించారు. వారి సూచన మేరకు పదివేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకొని లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని ఏసీబీ కరీంనగర్ కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు.

### 'ఉపాధి' పనులను వినియోగించుకోవాలి

**- ఎంపీడీవో పీ శ్రీనివాస్**

**ముద్ర, మంచిర్యాల:**
మెరుగైన జీవనోపాధి కోసం ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని తాండూర్ ఎంపీడీవో పీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా తాండూరు, రాజీవ్ నగర్ గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఏపీవో నంద కుమార్ రెడ్డితో కలిసి సందర్శించారు. కూలీలతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఉదయం వచ్చి ఉపాధి హామీ పనులు చేసుకుంటున్నట్లు కూలీలు వివరించారు. దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ పని ప్రదేశంలో సంబంధిత వేజ్ సీకర్స్ కు తప్పనిసరిగా ఉదయం 7 గంటలకు పని ప్రదేశానికి చేరుకొని, సంబంధిత క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పని చేయాలని సూచించారు. 2025-2026 ఆర్థిక సంవత్సరం మార్చి 31 వరకు ముగుస్తుందని, ఉపాధిహామీ పనులకు కూలీలు ఎక్కువ సంఖ్యలో వచ్చి మండల టార్గెట్ పనులు పూర్తి చేయాలని అన్నారు.

## సబ్ వే నిర్మాణానికి మల్కాజ్ గిరి ఎంపి 'ఈటల' శంకుస్థాపన



**ముద్ర, కరీంనగర్:**
వాజ్ పేయి నగర్ వద్ద ఎల్ సి గేట్ బిపి నంబర్ 8 స్థానంలో, రోడ్ అండర్ బ్రిడ్జి నిర్మాణానికి సఫిల్ గూడ రైల్వే స్టేషన్ సమీపంలో లిమిటెడ్ హైట్ సబ్ వే నిర్మాణానికి మంగళవారం నేరేడ్ మెట్ రైల్వే స్టేషన్ లో మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఇతర ప్రముఖుల సమక్షంలో ఎంపి ఈటల రాజేందర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్, సికింద్రాబాద్ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇన్ ఫ్రా) కె. ముత్యాల నాయుడు, హైదరాబాద్ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ డి.ఎస్. రామా రావు, దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ. శ్రీధర్, దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయనాథ్ కోట్లా ఇతర సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రూ.87.28 కోట్ల విలువైన రెండు ముఖ్యమైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన జరిగిందని అన్నారు. వాజ్ పేయి నగర్ లోని రోడ్ అండర్ బ్రిడ్జి, సఫిల్ గూడ రైల్వే స్టేషన్ సమీపంలోని లిమిటెడ్ హైట్ సబ్ వే మల్కాజ్ గిరి ప్రజల చిరకాల వాంఛ అని ఆయన పేర్కొన్నారు. పనులు సజావుగా సకాలంలో పూర్తి కావడానికి ఈ ప్రాజెక్టులకు రైల్వేలే నిధులు సమకూరుస్తున్నాయని ఆయన నొక్కి చెప్పారు. అంతేకాకుండా, అండర్ బ్రిడ్జిలు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, ఎక్స్ ప్రెస్ రైళ్ళకు స్టాప్ ల ఏర్పాటు, రైలు పట్టాలపై మెరుగైన భద్రతా చర్యలు వంటి విషయాలలో తెలంగాణ ప్రజలకు అత్యుత్తమ రైలు మౌలిక సదుపాయాలను అందించడానికి అన్ని స్థాయిలలో నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎంపి ఉద్ఘాటించారు. సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, వాజ్ పేయి నగర్ లోని ఎల్ సి నంబర్ బిపి-8 వద్ద ఆర్.యు.బి నిర్మాణం రూ.74.47 కోట్లతో మంజూరైందని, సఫిల్ గూడ వద్ద ఎల్.హెచ్.ఎస్ రూ. 12.81 కోట్లతో చేపడుతున్నట్లు తెలిపారు. ముందుగా సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాల కృష్ణన్ స్వాగతోపన్యాసంలో ప్రాజెక్ట్ వివరాలను వివరించారు. ఈ రెండు కార్యక్రమాల నిర్మాణం రోడ్డు భద్రత, సజావుగా ప్రయాణం, వేచి ఉండే సమయాన్ని ఆదా చేయడం పరంగా నగర ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన తెలియజేశారు.

## ఘనంగా టీబీజీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

**ముద్ర, పెద్దపల్లి:**
తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం 24వ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గోదావరిఖని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయం జీడికే-11 గనిలో జరిగిన వేడుకల్లో టీబీజీకేస్ కేంద్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి మాట్లాడారు. పోరాటాలతో పురుడు పోసుకొని కార్మికుల హక్కుల కోసం నిరంతరం పాటుపడుతూ గని ప్రమాద బాధితుల పక్షాన పోరాటంతో పురుడు పోసుకున్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్మికులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందించలో ముందుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో సకలజనుల సమ్మెలో అన్ని సంఘాలను కార్మికులను ఐక్యం చేయడంలో ద్వారా తెలంగాణ సాధించడంలో కీలక పాత్ర పోషించిందని, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్మికులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందించడంలో ముందు వరసలో నిలిచి గత ప్రభుత్వాలు పోగొట్టిన డిపెండెంట్ ఉద్యోగాలను కారుణ్య నియామకాల ద్వారా సాధించి 20వేల మందికి ఉద్యోగ అవకాశం కల్పించడం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పాత్ర కీలకమైనదని ఆయన పేర్కొన్నారు.

ఆర్ జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాస రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య, నాయకులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
28.01.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### క్రీడా ప్రపంచంలో వింతలు

కంటిచూపు లేకుండా గోల్ఫ్: చార్లీ బోస్వెల్ అనే వ్యక్తి రెండో ప్రపంచ యుద్ధంలో చూపు కోల్పోయినప్పటికీ, ఆ తర్వాత 16 సార్లు నేషనల్ బ్లైండ్ గోల్ఫ్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నారు.





# వైభవంగా శ్రీవారి నిత్య కళ్యాణోత్సవం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయణం, పుష్య మాసం శుక్ల పక్షము నవమి, హేమంత ఋతువు, మంగళవారం కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ఠ దర్శనాన్ని చేయించారు. అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవ, స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనం, విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారిని దర్శించుకున్నారు. స్వర్ణగిరీశుని దర్శించుకున్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మంగళవారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వేంకటేశం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# బీఆర్ ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ లో చేరిక

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో మాజీ బిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ నాజీయా జహంగీర్ రహేమాన్ భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమంలో వల్ల పార్టీ చేరాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో 15 వార్డ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వస్తుపుల సాయి కిరణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం బింగి బిక్షపతి, ఎండీ తాజ్ అవైస్ చిస్తీ, కూర వెంకటేష్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# సమ్మెను జయప్రదం చేయండి

- **జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పిలుపు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ఫిబ్రవరి 12 న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు సీఐటీయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు కల్లూరి మల్లేశం, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి యండి ఇమ్రాన్, ఐఫ్ టుయు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచకొండ జనార్ధన్ లు కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి అధ్యక్షతన దుంపల మల్లారెడ్డి ట్రస్ట్ భవనంలో జరిగిన జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ యాదాద్రి భువనగిరి జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. కార్మిక సంఘాల నాయకులు కల్లూరి మల్లేశం, యండి ఇమ్రాన్, ఆర్ జనార్ధన్ లు మాట్లాడుతూ... నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని అన్నారు. దీనిలో భాగంగానే 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారని అన్నారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని సమ్మె జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో సమ్మె జయప్రదం కోసం ఫిబ్రవరి 03న కార్మిక సంఘాల జిల్లా సదస్సును నిర్వహిస్తామని, ఈ సదస్సులో సిఐటియు, ఏఐటిసియు, ఐ యన్ టి యూ సీ, ఐ ఎఫ్టీ యు , బి ఆర్ టి యు,హెచ్ ఎం ఎస్, ఇతర అన్ని కార్మిక సంఘాల మండల, జిల్లా నాయకత్వం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దాసరి పాండు ,మాయ కృష్ణ, ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి శోభన్ బాబు ప్రజాసంఘాల నాయకులు దయ్యాల నరసింహ, వనం రాజు పాల్గొన్నారు.



# దేశ సేవలో భాగస్వాములవ్వాలి

- **రిటైర్డ్ నేవీ లెఫ్టినెంట్ కమాండర్ అభిజిత్**
- **నవ భారత యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో నేతాజీ జయంతి వేడుకలు**
- **విద్యార్థినులకు స్ఫూర్తి నిచ్చిన వింగ్ కెప్టెన్ ఆశా జ్యోతిర్మయి**

**ముద్ర, ఖమ్మం:**

భారత స్వాతంత్ర్య సంగ్రామ సింహం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు, వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన శుభసందర్భాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగరంలో మంగళవారం నవ భారత యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో అద్భుతమైన కార్యక్రమం జరిగింది. గాంధీ చౌక్ లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వేదికగా జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వింగ్ కెప్టెన్ ఆశా జ్యోతిర్మయి విద్యార్థినులలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. దేశ రక్షణలో మహిళల పాత్ర, వైమానిక దళంలో విద్యార్థినులకు ఉన్న సువర్ణావకాశాలను ఆమె పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కళ్లకు కట్టినట్లు వివరించారు. ప్రతి విద్యార్థిని తమ తల్లిని ఆదర్శంగా తీసుకుని, ఉన్నత లక్ష్యాలతో జీవితంలో ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన రిటైర్డ్ నేవీ లెఫ్టినెంట్ కమాండర్ అభిజిత్ మాట్లాడుతూ.. త్రివిధ దళాల్లో చేరేందుకు విద్యార్థినులకు ఉన్న విస్తృత అవకాశాలను వివరించారు. దేశ సేవలో భాగస్వాములు కావడం ద్వారా కలిగే గౌరవం, గుర్తింపు గురించి తెలియజేసి విద్యార్థులను ఉత్తేజపరిచారు.

మరోవైపు, ప్రస్తుతం పరీక్షల సమయం కావడంతో విద్యార్థులు ఒత్తిడిని ఎలా జయించాలనే అంశంపై ఖమ్మం ప్రముఖ వైద్యులు డాక్టర్ కుసుమరాజు రవికుమార్, కూరపాటి ప్రదీప్ అమూల్యమైన సలహాలు, సూచనలు అందించారు. మానసిక దృఢత్వంతో పరీక్షలను ఎదుర్కోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ న్యాయవాది హార్కర శ్రీరాం రావు, సిఆర్ఐ పంప్స్ డీలర్ అధినేత బోనాల రామకృష్ణ, సహస్ర హాస్పిటల్ అధినేత మారుతి బాబు పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.నేతాజీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డి ఐ ఈ ఓ రవిబాబు, నవ భారత యువ చైతన్య సమితి అధ్యక్షులు రాఘవరావు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ అరుణ్ కుమార్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ బానోత్ రెడ్డి, సమితి ప్రధాన కార్యదర్శులు గణేష్, దేవేందర్, కోశాధికారి నవీన్, సెక్రటరీ సునీల్ తదితరులు పాల్గొన్నారు.





# అర్ధ శతాబ్దంగా వైద్య సేవలు

- **గ్రామీణ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర**
- **తెల్లబెల్లిలో మొదలై..కోదాడ పట్టణానికి వ్యాప్తి**
- **హస్త వాసి ఉన్న ఆర్ఎంపీ వైద్యునిగా టీ.ఎన్.బాబు**

**ముద్ర ప్రతినిధి, కోదాడ:**

> "వైద్యో నారాయణో హరిః" అంటే వైద్యుడు సాక్షాత్తు నారాయణుడితో (విష్ణువు) సమానం అని అర్థం. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి పునర్జన్మ ప్రసాదించే శక్తి వైద్యుడికి ఉందని, వారు నిస్వార్థంగా సేవ చేసే దేవుళ్లతో సమానమని ఈ వాక్యం చెబుతుంది. తల్లిదండ్రులు జన్మనిస్తే, వైద్యులు ప్రాణాలను కాపాడి కొత్త జీవితాన్ని ఇస్తారని భావిస్తారు.. అలాంటి కోవకే చెందుతారు ఆఎంపీ వైద్యుడు టీ.ఎన్.బాబు.

ఆస్పత్రులు, ఆధునిక వైద్య సదుపాయాలు లేని 80వ దశకంలో సైకిల్‌పై తెల్లబల్లి గ్రామంలో ప్రతి ఇంటికి తిరుగుతూ రోగులకు చికిత్స అందించిన రోజులు ఆయన జీవితంలో మరపురాని జ్ఞాపకాలు. చిన్న జ్వరాలు, గాయాలు, పురుగు కాట్లు, తేలు, పాముకాట్ల దగ్గర నుండి సాధారణ ప్రసవాల వరకు వైద్యం అందించిన ఘనత టి ఎన్ బాబు ది. అనేక సందర్భాల్లో పిలిచిన వెంటనే స్పందిస్తూ ప్రజలకు అండగా ఉండి సరైన సమయానికి వైద్యం అందించి ఎందరో ప్రాణాలను కాపాడిన ఘనత ఆయనదే. గ్రామీణ ప్రజలకు వైద్య సేవలే లక్ష్యంగా జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి డాక్టర్ టి ఎన్ బాబు. గత 50 సంవత్సరాలుగా ఆర్ఎంపి డాక్టర్‌గా వేలాది మంది రోగులకు సేవలందిస్తూ ఆయన ఒక సేవాభిమానిగా గుర్తింపు పొందారు. ప్రారంభంలో సరైన వనరులు లేకపోయినా, పేద-ధనిక భేదం లేకుండా ప్రతి రోగిని తన కుటుంబ సభ్యుడిలా చూసుకుంటూ వైద్యం అందించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందిస్తూ అనేక ప్రాణాలను కాపాడారు. చిన్నపాటి జ్వరాల నుంచి దీర్ఘకాలిక వ్యాధుల వరకు తన అనుభవంతో సరైన చికిత్స అందించడం ఆయన ప్రత్యేకత. డబ్బే లక్ష్యంగా కాకుండా సేవే ధ్యేయంగా తన వృత్తిని కొనసాగించడం డాక్టర్ బాబు ప్రత్యేకత. డబ్బులు లేని పేదలకు ఉచితంగా చికిత్స చేయడం, మందులు అందించడం ఆయనకు అలవాటుగా మారింది. ఎన్నో సందర్భాల్లో పేషెంట్ల ఆరోగ్యం బాగుపడిన తర్వాతే ఫీజు తీసుకున్న సందర్భాలూ ఉన్నాయి. ఇదే కారణంగా ఆయనకు గ్రామ ప్రజల్లో అపారమైన గౌరవం ఏర్పడింది.

రాత్రి-పగలు తేడా లేకుండా పిలుపు వస్తే వెంటనే అందరికీ అందుబాటులో ఉండే డాక్టర్ బాబు సేవలను ముఖ్యంగా ఆకుపాముల , కోదండరామాపురం, తెల్లబల్లి, ఎక్లాస్కాన్ పేట, రామాపురం గ్రామ ప్రజలు ఎంతో గౌరవంతో గుర్తు చేసుకుంటున్నారు. ఆయన సేవలకు కృతజ్ఞతగా ఇటీవల గ్రామస్తులు సన్మాన కార్యక్రమం నిర్వహించి, ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబు మాట్లాడుతూ, “నన్ను నమ్మి వచ్చిన పేషంట్లను ఆరోగ్యవంతులుగా ఇంటికి పంపించడమే నా లక్ష్యంగా పెట్టుకుని పనిచేశాను ” అని అన్నారు. 50 సంవత్సరాల సుదీర్ఘ సేవలతో డాక్టర్ బాబు నేటి యువ వైద్యులకు ఆదర్శంగా నిలుస్తూ, సేవాభావంతో వైద్య వృత్తిని ఎలా నిర్వహించాలో చాటిచెప్పుతున్నారు.







# ప్రత్యేక గ్రీవెన్స్ రద్దు

- **జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్ రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినందున కోడ్ అమలులోకి వచ్చినందున ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్, ఉద్యోగ వాణి కార్యక్రమం ఉండదన్నారు. విషయాన్ని జిల్లాలోని ప్రజలు గమనించి వివిధ సమస్యల పై అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు రావద్దని తెలిపారు.

### రెండు నెలల్లో ఇందిరమ్మ ఇళ్లు

# అందజేస్తాం

- **ఎమ్మెల్యే కుంభం**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

రెండు నెలల్లోగా పనులను పూర్తి చేసి ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తామని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు, ఆర్డీఓ కృష్ణారెడ్డి, అధికారులతో కలిసి డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులను రెండు నెలల్లో పూర్తిచేసి అందజేస్తామని హామీ ఇచ్చారు. అధికారులు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, మాజీ కౌన్సిలర్ ఈరపాక నరసింహ, నాయకులు పాల్గొన్నారు.



# తుర్కపల్లి మండలంలో పులి కలకలం

- **పట్టుకునేందుకు ఫారెస్ట్ అధికారుల ఏర్పాట్లు**

**ముద్ర, తుర్కపల్లి:**

యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని పలు ప్రాంతాలలో పులి సంచారం కలకలం రేపుతోంది. గత కొన్ని రోజులుగా పులి కనిపించిందన్న వార్తలతో చుట్టుపక్కల గ్రామాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రజలు బయటకు రావాలంటేనే ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పులిని పట్టుకునేందుకు ఫారెస్ట్ అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టారు. పులి సంచరిస్తున్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక బోండ్లు ఏర్పాటు చేసి, పులిని సురక్షితంగా పట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అలాగే ట్రాప్ కెమెరాలు, ఫారెస్ట్ సిబ్బంది పహారా, నిఘా వ్యవస్థను మరింత కఠినతరం చేశారు. పులి అడుగుజాడలు కనిపించిన ప్రాంతాలను అధికారులు సీరియస్‌గా తీసుకొని, అక్కడి ప్రజలను అప్రమత్తం చేశారు. అవసరం లేని ప్రయాణాలు చేయవద్దని, ముఖ్యంగా అటవీ ప్రాంతాలకు సమీపంలో నివసించే గ్రామస్తులు రాత్రి వేళల్లో బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ప్రజలు భయంతో గుంపులుగా మంటలు వేసుకుంటూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పశువులను బయటకు వదలకుండా, పిల్లలను ఇంట్లోనే ఉంచాలని గ్రామస్థులు పరస్పరం హెచ్చరిస్తున్నారు. “ఇప్పటికైనా పులి దొరుకుతుందా లేదా?” అనే సందేహంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు మాత్రం పులిని త్వరలోనే పట్టుకునే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇస్తున్నారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైతే అదనపు బలగాలను రంగంలోకి దింపుతామని తెలిపారు. తుర్కపల్లి మండల ప్రజలు పరిస్థితి సాధారణ స్థితికి చేరే వరకు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 28-01-2026
www.mudranews.in | @mudranews



**క్రీడా ప్రపంచంలో వింతలు**



**వింత అవుట్:** 19 81లో ఆస్ట్రేలియా బౌల ర్ ట్రెవర్ చాపెల్, న్యూ జిలాండ్ బ్యాటర్ సిక్స్ కొట్టకుండా ఉండటానికి 'అం డర్ ఆర్మ్' (నేల మీద నుంచి) బౌలిం గ్ చేసి విమర్శలు ఎదుర్కొన్నారు.

# పకడ్బందీగా మున్సిపల్ ఎన్నికలు

**మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలలో 75 వార్డులుండగా, 150 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నామినేషన్ పక్రియ నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండి, ఎన్నికల సంఘం నియమాల ప్రకారం ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎటువంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తూ, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేయాలని, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. సరిపడా సిబ్బంది, బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు, పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ మెంచు నగేష్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, డిఆర్డీవో శ్రీనివాసరావు, డిఎస్పీలు ప్రసన్న కుమార్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు తూప్రాన్ పురపాలక సంఘంలో ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ కోసం ఆర్డీఓ జయచంద్ర రెడ్డి, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ తో కలిసి పరిశీలించారు.

**75 వార్డులు, 87,615 మంది ఓటర్లు..**

మెదక్ జిల్లాలో నాలుగు న్సిపాలిటీలలో 75 వార్డులు ఉండగా 87,615 మంది ఓటర్లు ఉన్నారు. మెదక్-32 వార్డులు, 37,016 ఓటర్లు, రామాయంపేట -12 వార్డులు, 13,106 ఓటర్లు, నర్సాపూర్ -15 వార్డులు, 17,066 ఓటర్లు, తుప్రాన్ -16 వార్డులు 20,427 ఓటర్లు ఉన్నారు. మొత్తం 75 వార్డులు ఉండగా 150 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**షెడ్యూల్ ఇలా..**

మున్సిపల్ ఎన్నకల కోసం ఈ నెల 28 నుంచి 30 వరకు నామి నేషన్ల స్వీకరణ ఉంటుంది. 31న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. ఫిబ్రవరి 1న అభ్యంతరాలపై అప్పీలు, 2న పరిష్కారం, 3న నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు ఉంటుంది. కాగా అదే రోజు గుర్తుల కేటాయిస్తారు. 11న పోలింగ్, 12నరీపోలింగ్, 13న కౌంటింగ్ ఫలితాల ప్రకటన ఉంటుంది.

## దారి మళ్లుతున్న మున్సిపల్ నిధులు

**అఖిలపక్షం కౌన్సిలర్లు సాకి బాల్ లక్ష్మి, రియాజుద్దీన్**

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** సిద్దిపేట మున్సిపాలిటీలో నిధులు దారి మళ్లుతు న్నాయని అఖిలపక్షం కౌన్సిలర్లు సాకి బాల్ లక్ష్మి, రియాజుద్దీన్, కవిత, శ్రదేవి, కొత్తపల్లి రాధ, పూర్ణిమ ఆరోపించారు. మంగళవారం సిద్దిపేట మున్సిపాలిటీలో పాలకవర్గం సాధారణ సమావేశం నిర్వహించిన అనంతరం అఖిల పక్షం ఆధ్వర్యంలో మున్సిపల్ ఏజెండా ను కాల్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ నిధులు ఇష్టారీతిగా బడ్జెట్ కేటాయింపులు చేస్తూ దోపిడీకి పాల్పడు తున్నారని విమర్శించారు. పట్టణంలోని ప్రైవేట్ సంఘాలకు ప్రజల సొమ్ము ఎలా కేటాయిస్తారని మండిపడ్డారు. పట్టణంలోని 12వ వార్డులో ప్రజాప్రతినిధి వ్యవసాయ క్షేత్రానికి రోడ్లు వేసుకోవడం సిగ్గు చేటన్నారు. కాలనీలో కొన్ని చోట్ల రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, సొంత పొలానికి రోడ్లు వేయించుకోవడం ప్రజల పన్నులను దుర్వినియోగం చేయడమే అన్నారు. మున్సిపల్ చైర్మన్, కమిషనర్ కుమ్మక్కయ్ ఆడుతున్నా నాటకాలని ఆరోపించారు. కోట్ల రూపాయలను పక్కదారి మళ్లీస్తున్నారన్నారు. ఇక్కడి మున్సిపల్ కమిషనర్ ను సస్పెండ్ చేయలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాకి ఆనంద్, బీజేపీ నాయకుడు కొత్తపల్లి వేణుగోపాల్, ఎల్లం తదితర నాయకులు పాల్గొన్నారు.



## గురుకుల సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** జిల్లా కేంద్రంలోని పాత మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను కలెక్టర్ హైమావతి తనిఖీ చేశారు. వంట గది, డైనింగ్ హాల్ గదులు మురికిగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం డిటర్జెంట్ తో కడిగాకే వంట చేయాలని, డైనింగ్ హాల్ లో విద్యార్థులకు భోజనం పెట్టాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. మళ్లీ గంటలో వస్తానని, మొత్తం శుభ్రం చేయాలని పారిశుధ్య సిబ్బందిని హెచ్చరించారు.

గంట తర్వాత మళ్లీ గురుకుల పాఠశాలలో పారిశుధ్య సిబ్బంది పనిని పర్యవేక్షించారు. వంట గది, డైనింగ్ హాల్ కడిగాక ఎంత శుభ్రం గా ఉందని, రోజు ఇలాగే చేయాలని ఆదేశించారు. మళ్లీ పర్యవేక్షణకు వచ్చినపుడు అపరిశుభ్రంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం ఇడ్లీ పెట్టామని, మధ్యహ్నం అన్నం, చిక్కుడుకాయ, గుడ్డు, సాంబారు చేస్తున్నట్లు వంట సిబ్బంది తెలిపారు. విద్యార్థులకు రుచికరంగా వండాలని ఆదేశించారు. స్టోర్ రూమ్ లో మెటీరియల్ ను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు ప్రకారం రోజు ఆహార పదార్థాలను అందించాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. విద్యార్థులకు కామన్ డైట్ మెనూ పాటించడం తో పాటు మంచి విద్యాబుద్ధులు నేర్పించాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ఆదేశించారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్**




**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12 న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్ కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు. మంగళవారం నంగునూరులో నిర్వహించిన సీఐటీయూ మండల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నడూ లేనంతగా మరింత బరితెగించి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందని ఆరోపించారు. కార్మిక వర్గాన్ని యాజమాన్యలకు ఊడిగం చేసే కట్టు బానిసలుగా మార్చే విధంగా 29 చట్టాలను రద్దు చేసిందన్నారు. వీటి ఫలితంగా స్వాతంత్రం పూర్వం కార్మిక వర్గ నాయకత్వం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న చట్టా లను రద్దు చేసిందని విమర్శించారు. ఈ నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటుగా 2005 నుంచి అమలులో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి వీబీజీ రాంజీ అనే పేరుతో చట్టాన్ని కాస్త స్కీముగా మార్చేసిందన్నారు. దీని ఫలితంగా గ్రామీణ ప్రాంతంలో కూలీలకు ఉపాధి దొరకకుండా పోతుందన్నారు. ఇప్పటి వరకు ఉన్న చట్టంలో 100 రోజుల గ్యారెంటీ పని ఉండేదన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి జాబు హోల్డర్ కు పని కల్పించకుంటే 15 రోజుల్లో రోజు వేతనం చెల్లించే అవకాశం ఉండేదన్నారు. కానీ నేడు ఈ స్కీమ్ లో అది లేదన్నారు. వ్యవసాయ పనులు జరుగుతున్న సమయంలో 60 రోజులు పనిని నిషేధించడమటే ఉపాధి పని దినాలను కోత పెట్టడమేనన్తారు.

గ్రామీణ ప్రాంతంలో ఉపాధి కార్మికులకు నష్టం కలిగించే స్కీముని వెనక్కి తీసుకోవాలని కోరారు. మరో విద్యుత్ సవరణ బిల్లును తీసుకువచ్చి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న విద్యుత్ సంస్థలన్నిటిని ప్రైవేటు కంపెనీలకు అప్పగించే ప్రయత్నం చేస్తుందన్నారు. కరెంటును కూడా రీఛార్జ్ చేసుకునే పద్ధతిని తీసుకువస్తుందన్నారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ సమ్మెను చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న కార్మికులు, రైతులు వ్యవసాయ కూలీలు ఈ సమ్మెలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని చొప్పరి రవి కుమార్ కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు చిట్యాల కనకయ్య, నంగునూరు మండల నాయకులు అన్న రాజు, ఎల్లయ్య, శ్రీనివాస్, దేవులపల్లి నర్స వ్వ, దేవులపల్లి పోషవ్వ, దేవులపల్లి దేవవ్వ, కళావతి, పరశు రాములు తదితరులు పాల్గొన్నారు.

## నోడల్ అధికారుల నియామకం




**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల, గజ్వేల్ మున్సిపాలిటీలకు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ నోడల్ అధికారులను నియమించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కే. హైమావతి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదిని మంగళవారం జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించన వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ అధికారులు అంకితభవంతో పనిచేసి మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమీదిని ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన అనంతరం జిల్లా కలెక్టర్ కే.హైమావతి కలెక్టరేట్లో మున్సిపల్ ఎన్నికల జిల్లా నోడల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణ, బ్యాలట్ బాక్సులు, రవాణా, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఖర్చుల పర్యవేక్షణ, మీడియా, హెల్ప్‌లైన్, ఫిర్యాదుల పరిష్కారం, నివేదికలు, మైక్రో అబ్జర్వర్లు తదితర కీలక అంశాలకు జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. నియమితులైన నోడల్ అధికారులు జిల్లా ఎన్నికల యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, ఆదేశాల ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు.

ఎన్నికల ప్రక్రియను పార దర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే జిల్లా యం త్రాంగం లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా ఎలాంటి పొర పాటుకు తావులేకుండా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో రాజ్ కుమార్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీ సీఈఓ రమేష్, డీపీఆర్ఓ రవికుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, డివిజనల్ పంచాయతీ అధికారి, సహకార అధికారి నాగేశ్వరరావు, ఎన్నికల శిక్షణ అధికారులు అయోధ్య రెడ్డి, రామస్వామి, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్ స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రిన్సిపాల్ గా సురేఖ



**ముద్ర ప్రతినిధి, మెదక్:** స్థానికి మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.సురేఖ ఉత్తమ ఉద్యోగిగా పురస్కారం అందుకున్నారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మెదక్ పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు ప్రశంసాపత్రం అందజేశారు. అదనపు కలెక్టర్ నగేష్, ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు, ఇంచార్జి మైనారిటీ జిల్లా అధికారి విజయలక్ష్మి తదితరులు అభినందించారు. గతంలో సురేఖ 2022 ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రిన్సిపాల్ అవా అందుకున్నారు. 2025 ఆగస్టు 25న ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు, తాజాగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రినిపాల్ అవార్డుకు ఎంపికయ్యారు.

## బాలసదన్ విద్యార్థులకు బ్యాగ్ ల పంపిణీ




**ముద్ర ప్రతినిధి, మెదక్:** స్థానిక బాలసదన్‌లోని 25 మంది విద్యార్థులు మంగళవారం ఆర్ఐ శైలేందర్ స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ శ్రీనివాస రావు సూచనతో యూత్ ఫర్ సేవ సంస్థ సహకరించాలని కోరారు. విద్యే జీవితంలో అత్యంత విలువైన సంపద అన్నారు. కష్టపడి చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు. సమాజానికి ఆదర్శ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సీసీ రాజేందర్, నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏకలవ్య మహర్షి విగ్రహం ఏర్పాటు చేయాలి




**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** పట్టణంలో ఏకలవ్య మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని 26వ వార్డు కౌన్సిలర్ కెమ్మసారం ప్రవీణ్ డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన సిద్దిపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని కులాలకు లభిస్తున్న గౌరవం ఏకలవ్య కులానికి కూడా దక్కాలన్నారు. ఏకలవ్య మహర్షి విగ్రహాన్ని పట్టణంలోని ప్రధాని కూడలి వద్ద ఏర్పాటు చేయాలని కోరుతూ మున్సిపల్ చైర్ పర్సన్ మంజులకు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు సానుకూలంగా స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
28.01.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**క్రీడా ప్రపంచంలో వింతలు**

గాలిలో ఆగిన మ్యాచ్: 1993లో లాస్ వెగాస్‌లో జరిగిన హెవీ వెయిట్ బాక్సింగ్ మ్యాచ్ మధ్యలో, ఒక వ్యక్తి పారాగ్లైడర్ సహాయంతో నేరుగా రింగ్‌లోకి దిగి అందరినీ షాక్‌కు గురిచేశాడు.







# బొగ్గు స్కాంపై సమగ్ర విచారణకు ఆదేశించండి

- సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో దర్యాప్తు చేయాలి
- విచారణ బాధ్యత కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఇవ్వండి
- గవర్నర్ కు బీఆర్ఎస్ నేతల వినతి
- కోల్ మాఫియాకు నాయకుడిగా సీఎం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

కాంగ్రెస్ పాలనలో జరిగిన బొగ్గు కుంభకోణం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కోరారు. విచారణ బాధ్యత సీబీఐకి ఇస్తారా..? లేదా సిట్టింగ్ జడ్జికి ఇస్తారా..? మీరే నిర్ణయం తీసుకోవాలన్నారు. సోలార్ పవర్‌లో కుంభకోణం, సింగరేణి ఓబి గనుల్లో కుంభకోణాలను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి అయినా విచారణ ఆదేశాలు జారీ చేయాలన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ బృందం మంగళవారం లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసింది. ఈ సందర్భంగా సింగరేణి టెండర్లలో బొగ్గు, డిజీల్ స్కామ్ జరిగిందని ఫిర్యాదు చేశారు. ఈ స్కామ్‌కు సంబంధించిన వివరాలను గవర్నర్‌కు అందజేశారు. అనంతరం లోక్ భవన్ బయట కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఫుట్ బాల్ మ్యాచ్ కోసం రూ. 10 కోట్ల సింగరేణి నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఇప్పటికే ప్రజలతో ఆడుకుంటున్న సీఎం.. సింగరేణి సంస్థతో కూడా ఫుట్ బాల్ ఆడుతున్నారని ఆరోపించారు. సీఎం అంటే కోల్ మాఫియాకు నాయకుడిగా భావించే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ఆధారాలతో సహా బయటపెట్టినప్పటి నుంచి కాంగ్రెస్‌లో వణుకు మొదలైందని చెప్పారు. ఈ కుంభకోణంపై తాము లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఒక్క సమాధానం రాలేదని మండిపడ్డారు. దీనిపై వివరణ ఇవ్వాల్సిన సీఎం రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ మ్యాచులు ఆడుతూ, విదేశాల్లో తిరుగుతూ పాఠాలు నేర్చుకుంటున్నా అని పోజులు కొడుతున్నాడని ఆరోపించారు. ఓబీ టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనతో పారదర్శకతకు పాతరేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సింగరేణి టెండర్లలో నిబంధనలు పెట్టారని విమర్శించారు. తమ పాలనలో బొగ్గు టెండర్లన్నీ పారదర్శకంగా నిర్వహించామన్నారు. నైనీలో కూడా గతంలో



2021లో, 2022లో రెండు సార్లు తమ ప్రభుత్వం ఉన్నప్పుడు టెండర్లు పిలిచామనీ కానీ ఆ రోజు ఈ సైట్ విజిట్ సర్టిఫికేట్ అనే నిబంధన లేదని గుర్తు చేశారు. నాడు తమ ప్రభుత్వంలో అవసరం లేని నిబంధన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎందుకు అవసరమైందని నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో జరిగిన సోలార్ పవర్ స్కామ్ గురించి కూడా ఇటీవల తాము బయట పెట్టామన్నారు. దేశంలో ఎక్కడైనా మెగావాట్‌కు రూ. రెండున్నర నుంచి రూ. 3 కోట్ల ఖర్చుతో సోలార్ నిర్మాణం జరుగుతుందన్నారు. కానీ తెలంగాణలో మాత్రం సింగరేణి పిలిచిన సోలార్ టెండర్లలో మాత్రం రూ. ఏడు కోట్లు అన్నారు. దేశం మొత్తంలో రూ. 3 కోట్లలోపు పని ఒక్క తెలంగాణలో మాత్రం రూ. 7 కోట్లు ఎందుకు అవుతున్నదని నిలదీశారు. టెండర్లలో లేని షరతు మీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ 'సైట్ విజిట్ సర్టిఫికేషన్' అనే విధానం ఎందుకు పెట్టారు? ఎవరికి లాభం చేయడానికి పెట్టారో సమాధానం చెప్పాలన్నారు. నిబంధన అప్పటి నుంచి తొమ్మిది నెలల్లో ఎన్ని సంస్థలు ఇప్పటి వరకు ఎంతమంది కాంట్రాక్టర్లు సైట్ సందర్శించారు? మీకు ఎన్ని ఈమెయిల్స్ వచ్చాయి? ఎన్ని లేఖలు వచ్చాయి? ఎన్ని సర్టిఫికేట్లు సింగరేణి సంస్థ జారీ చేసింది? అని ప్రశ్నించారు. వీటిపై శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సైట్ విజిట్ లో కొంతమందినే ఎందుకు ఎంపిక చేశారో చెప్పాలని కోరారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే విచారణ పేరిట ఒక్కొక్కరిని పిలుస్తున్నారని దుయ్యబట్టారు.

## ట్రంప్ పై అమెరికాలో వ్యతిరేకత?

- ఇమిగ్రేషన్ కఠినతపై అమెరికన్ల అసంతృప్తి..
- అధ్యక్షుడి నిర్ణయాలకు తగ్గుతున్న ప్రజా మద్దతు
- రాయిటర్స్–ఇప్సాస్ పోల్ వెల్లడి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠిన ఇమిగ్రేషన్ విధానాలపై అమెరికన్ ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నట్లు తాజా సర్వే వెల్లడించింది. రాయిటర్స్-ఇప్సాస్ సంయుక్తంగా నిర్వహించిన పోల్‌లో ట్రంప్ నిర్ణయాలకు మద్దతు గణనీయంగా తగ్గినట్టు తేలింది.
వలసలను నియంత్రించేందుకు ట్రంప్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఇమిగ్రేషన్ ఏజెంట్లను మోహరించింది. అయితే ఈ చర్యలు అతి దూరం వెళ్లాయన్న అభిప్రాయం ప్రజల్లో బలపడుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి ఆదివారం మధ్య చేపట్టిన సర్వేలో ట్రంప్ విధానాలను ఆమోదించేవారి శాతం 39కి పడిపోయింది. ఇదే గత సర్వేలో 41 శాతంగా ఉండటం గమనార్హం. మరోవైపు 53 శాతం మంది ప్రభుత్వ ఇమిగ్రేషన్ విధానాలను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.
ఇదిలా ఉండగా మినియాపొలిస్‌లో జరిగిన నిరసనల్లో ఇమిగ్రేషన్ ఏజెంట్లతో జరిగిన ఘర్షణల్లో ఓ అమెరికా పౌరుడు ప్రాణాలు కోల్పోవడం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఈ ఘటన ప్రజాభిప్రాయంపై మరింత ప్రతికూల ప్రభావం చూపిందని విశ్లేషకులు చెబుతున్నారు.
ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత వలసలకు సంబంధించిన నిబంధనలను మరింత కఠినతరం చేశారు. ప్రారంభ దశలో ఈ చర్యలకు ప్రజల నుంచి బలమైన మద్దతు లభించింది. గత ఫిబ్రవరిలో దాదాపు 50 శాతం మంది ఆయన విధానాలను సమర్థించగా, తాజా సర్వేలో ఆ మద్దతు తగ్గడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.
ఇమిగ్రేషన్ అంశం అమెరికా రాజకీయాల్లో కీలకంగా ఉన్న వేళ, అమెరికాలో ప్రజాభిప్రాయం ఎలా మలుపు తిరుగుతుందన్నది రానున్న రోజుల్లో ట్రంప్ పాలనపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మోడీకే వక్రభాష్యం..

- ఎక్స్ పోస్ట్‌ను వక్రీకరించిన గ్రోక్
- దౌత్య సందేశానికే తప్పు అర్థం పెట్టిన ఏఐ..
- గ్రోక్‌పై మళ్లీ విమర్శలు..
- ఎక్స్ తీసుకుంటున్న దిద్దుబాటు చర్యలు
- ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



ఎక్స్ (ట్విట్టర్)లోని ఏఐ టూల్ గ్రోక్ ఏఐ తాజాగా తీవ్ర వివాదానికి దారితీసింది. రిపబ్లిక్ డే సందర్భంగా మాల్దీవుల నుంచి వచ్చిన శుభాకాంక్షలకు ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన స్పందనను గ్రోక్ పూర్తిగా వక్రీకరించి అనువదించిందని ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఘటన ఇరుదేశాల దౌత్య సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపేలా ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.
77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ మియాజు ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. దీనికి ప్రతిస్పందనగా మోదీ ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలుపుతూ, ఇరుదేశాల ప్రజల ప్రయోజనాల కోసం కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ సందేశాన్ని మాల్దీవుల అధికార భాష అయిన దివేహిలో పోస్టు చేశారు. అయితే ఈ పోస్టును ఆంగ్లంలోకి అనువదించిన గ్రోక్ ఏఐ అర్థాన్ని పూర్తిగా మార్చేసిందని జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. మోదీ పేర్కొన్న గణతంత్ర దినోత్సవాన్ని 'స్వాతంత్ర్య దినోత్సవం'గా మార్చడమే కాకుండా "మాల్దీవుల్లో భారత 77వ స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి. అందులో మాల్దీవుల ప్రభుత్వం పాల్గొంది. ఈ ప్రభుత్వం భారత వ్యతిరేక ప్రచారాల్లో పాల్గొంది" అనేలా అర్థభ్రాంతి కలిగించే అనువాదం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇది ఇరుదేశాల మధ్య ఉన్న సున్నితమైన దౌత్య సంబంధాలను దెబ్బతీసేలా ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
ఈ ఘటనతో ఏఐపై పూర్తిగా ఆధారపడటం ఎంతవరకు సురక్షితం అన్న చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. సున్నితమైన రాజకీయ, దౌత్య అంశాల్లో ఏఐ చేసిన చిన్న తప్పు కూడా పెద్ద వివాదానికి దారితీస్తుంది అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. సంబంధిత సంస్థలు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏఐ ఫీచర్లు ఇంకా ప్రయోగ దశలోనే ఉన్నాయని చెబుతున్నప్పటికీ, సోషల్ మీడియాలో సమాచారం క్షణాల్లో వైరల్ కావడం వల్ల నష్టం తీవ్రంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.
ఇదిలా ఉండగా గ్రోక్ ఏఐ మహిళలు, చిన్నారుల అసభ్య చిత్రాలను సృష్టిస్తోందంటూ ఇప్పటికే భారత్ సహా పలు దేశాల్లో విమర్శలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎక్స్ సంస్థ దిద్దుబాటు చర్యలు చేపట్టి, గ్రోక్‌లో ఫొటోలను ఇబ్బందికరంగా మార్చే అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. తాజా అనువాద వివాదం తర్వాత కూడా ఏఐ నియంత్రణలు, బాధ్యతాయుత వినియోగంపై మరింత కఠిన చర్యలు అవసరమన్న డిమాండ్ బలపడుతోంది.




## ముగిసిన సంతోష్‌రావు విచారణ

- ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎంపీ హాజరు
- 5 గంటల పాటు సంతోష్‌రావును ప్రశ్నించిన సిట్ అధికారులు
- ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ప్రభాకర్‌రావు నియామకంపై నిర్ణయం ఎవరిదంటూ ప్రశ్నలు
- ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి కొన్ని ఆధారాలు ముందు పెట్టి ప్రశ్నించిన సిట్
- సంతోష్‌రావు స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసిన సిట్ అధికారులు.

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మాజీ ఎంపీ సంతోష్ రావును సిట్ (SIT) అధికారులు సుదీర్ఘంగా విచారించారు. సుమారు ఐదు గంటల పాటు సాగిన ఈ విచారణలో అధికారులు పలు కీలక అంశాలపై సంతోష్ రావును ప్రశ్నించినట్లు సమాచారం. విచారణలో భాగంగా సిట్ అధికారులు ప్రధానంగా ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు నియామకం చుట్టూ ప్రశ్నలను సంధించారు. ప్రభాకర్ రావును ఇంటెలిజెన్స్ విభాగం అధిపతిగా నియమించాలనే నిర్ణయం అసలు ఎవరిది? ఆ నిర్ణయం వెనుక ఎవరి ఒత్తిడి ఉంది? అనే కోణంలో సంతోష్ రావును ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ప్రభాకర్ రావుకు, సంతోష్ రావుకు ఉన్న సంబంధాలపై కూడా అధికారులు ఆరా తీసినట్లు సమాచారం.
కేవలం ప్రశ్నలకే పరిమితం కాకుండా, ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి గతంలో సేకరించిన కొన్ని సాంకేతిక ఆధారాలను సంతోష్ రావు ముందు ఉంచి సిట్ అధికారులు విచారణ జరిపారు. లభించిన డిజిటల్ డేటా, కాల్ రికార్డ్స్ , ఇతర కీలక డాక్యుమెంట్లను చూపిస్తూ ఆయనను ప్రశ్నించారు. ఈ ఆధారాలను చూసిన తర్వాత సంతోష్ రావు నుంచి వచ్చిన సమాధానాలను అధికారులు క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నారు. ఐదు గంటల సుదీర్ఘ విచారణ అనంతరం సంతోష్ రావు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను అధికారులు అధికారికంగా రికార్డ్ చేశారు. ఆయన చెప్పిన విషయాలను వీడియో రూపంలో , రాతపూర్వకంగా భద్రపరిచారు. ఈ స్టేట్‌మెంట్ ఆధారంగా ఈ కేసులో మరికొందరిని విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## అమెరికా లేకుంటే యూరప్ కు రక్షణ లేదు..

- యూఎస్ ఏ లేకుంటే ఐరోపాకు భద్రతా ఎక్కడది?
- ప్రస్తుతం పరిస్థితుల్లో అమెరికాతో సంబంధాలు అవసరం
- నాటో చీఫ్ రుట్టే సంచలన వ్యాఖ్యలు

**ముద్ర న్యూస్:**

గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ ప్రకటించిన దగ్గర మిత్రులైన ఐరోపా దేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అమెరికా నిర్ణయంపై భగ్గుమన్నాయి. దీంతో మిత్ర దేశాల మధ్య ప్రస్తుతం సఖ్యత చెడింది. గ్రీన్‌లాండ్ ప్రస్తుతం డెన్మార్క్ ఆధ్వర్యంలో ఉంది. డెన్మార్క్ ఏమో నాటో సభ్యత్వంలో ఉంది. అమెరికా భద్రతా నేపథ్యంలో గ్రీన్‌లాండ్ స్వాధీనం చేసుకోవడం అవసరం అని అమెరికా వాదిస్తుంటే.. అబ్బే కుదరదంటూ యూరోపియన్ దేశాలు అడ్డుపడుతున్నాయి.
తాజాగా ఇదే అంశంపై నాటో చీఫ్ మార్క్ రుట్టే సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా సైన్యం మద్దతు లేకుండా యూరప్ తనను తాను రక్షించుకోగలదా? అని ప్రశ్నించారు. రక్షించుకోలేదని.. ఒకవేళ రక్షించుకోగలదని భావిస్తే మాత్రం ప్రస్తుతం ఉన్న సైనిక వ్యయాలను రెట్టింపు చేసుకోవాల్సిన అవసరం ఉంటుందని మార్క్ రుట్టే తేల్చి చెప్పారు.
"ఇక్కడ ఎవరైనా అనుకుంటే... యూరోపియన్ యూనియన్ లేదా యూరప్ మొత్తం అమెరికా లేకుండా తనను తాను రక్షించుకోగలదని కలలు కనండి. మీరు చేయలేరు. యూరప్‌యునైటెడ్ స్టేట్స్ ఒకదానికొకటి అవసరం. మీరు నిజంగా ఒంటరిగా ముందుకు వెళ్లాలనుకుంటే.. మీరు ఎప్పుడైనా 5 శాతంతో అక్కడికి చేరుకోగలరని మర్చిపోండి. అది 10 శాతం అవుతుంది. మీరు మీ స్వంత అణు సామర్థ్యాన్ని పెంచుకోవాలి. దానికి బిలియన్లబిలియన్ల యూరోలు ఖర్చవుతాయి. అమెరికా లేకుంటే స్వేచ్ఛ కోల్పోతాం.. అమెరికా అణు గొడుగు కోల్పోతాం" అని బ్రస్సెల్స్‌లో ఈయూ చట్టసభ సభ్యులతో రుట్టే వ్యాఖ్యానించారు.
వెనిజులాను అమెరికా స్వాధీనం చేసుకున్నాక గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ ప్రకటించారు. అమెరికా భద్రతా నేపథ్యంలో గ్రీన్‌లాండ్‌లో గోల్డెన్ డోమ్ నిర్మించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ నిర్ణయాన్ని కెనడా వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో కెనడా, ఐరోపా దేశాలపై సుంకాలు విధిస్తానని ట్రంప్ బెదిరించారు. ప్రస్తుతం మిత్ర దేశాలు మెత్తబడుతున్నట్లుగా తాజా పరిణామాలను బట్టి అర్థమవుతోంది.



## కిడ్నాప్.. భయంతో విడుదల

- పారిశ్రామిక వేత్త కుమారుడి కిడ్నాప్..
- రెండు వారాలకు దొరికిన ఆచూకీ

**ముద్ర, జాతీయ న్యూస్:**



ఝార్ఖండ్‌లో రెండు వారాల క్రితం అపహరణకు గురైన పారిశ్రామిక వేత్త కుమారుడిని వదిలిపెట్టారు. టాటానగర్‌లోని అదిత్యపుర్ చిన్న పరిశ్రమల సంఘం ఉపాధ్యక్షుడు దేవాంగ్ గాంధీ కుమారుడు కైరవ్ (24)ను అపహరించాలని కిడ్నాపర్లు కుట్ర పన్నారు. జవనరి 13న కారులో వెళ్తున్న అతడిని దుండగులు వెంబడించి కిడ్నాప్ చేశారు. ఆ తర్వాత కైరవ్‌ను కిడ్నాప్ చేశామని విదేశీ ఫోన్ నంబర్ తో అతడి తండ్రికి వాట్సాప్‌లో సందేశాలు పంపారు. రూ.5 కోట్లు ఇవ్వాలంటూ బ్లాక్‌మెయిల్ చేశారు. దేవాంగ్ ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. కైరవ్ కోసం 7 బృందాలుగా ఝార్ఖండ్, బిహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. దీంతో భయపడిన కిడ్నాపర్లు కైరవ్‌ను హజరీబాగ్‌లో వదిలేసి పారిపోయారు. అతడి ఆచూకీని గుర్తించిన పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపులు చేపట్టారు.

**క్రీడా ప్రపంచంలో వింతలు**

డ్రాగా ముగిసిన 10 రోజుల టెస్ట్: 1939లో ఇంగ్లాండ్ మరియు దక్షిణాఫ్రికా మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ 10 రోజుల పాటు సాగినా ఫలితం తేలలేదు; చివరికి ఇంగ్లాండ్ జట్టు ఓడ (షిప్) ఎక్కాల్సి రావడంతో మ్యాచ్ ఆపేశారు.

# ప్రజావ్యతిరేక విధానాలపై ఐద్వా పోరాటం

- వ్యూహాత్మక ప్రణాళికతో ప్రజల్లో వెళ్తాం
- మహిళలపై ఆర్ఎస్ఎస్, బీజేపీలు దాడులు తీవ్రతరం
- సర్.. పేరుతో బీహార్లో 45లక్షల మహిళా ఓటర్లను జాబితా నుంచి తొలగించారు
- ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుధా సుందర రామన్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




మనిషి జీవించేందుకు అత్యవసరమైన గాలి, నీరు వంటి వనరులను ప్రైవేటీకరిస్తున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ ఉపాధ్యక్షులు సుధా సుందర రామన్ పిలుపునిచ్చారు. జీవించే హక్కు కోసం భవిష్యత్తులో పోరాటాలను ఐద్వా మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు. వ్యూహాత్మక ప్రణాళికతో ప్రజల్లోకి వెళ్తామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో ఐద్వా 14వ జాతీయ మహాసభల మూడో రోజున నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 1981లో ఆవిర్భవించిన ఐద్వా దేశవ్యాప్తంగా 1.6 కోట్ల సభ్యులతో 26 రాష్ట్రాల్లో మహిళల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలు మహిళలపై దాడులను తీవ్రతరం చేశాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

**'సర్' పేరుతో ఓట్ల తొలగింపు..**

పౌరసత్వాన్ని నిరూపించుకునే విధంగా పత్రాలు సమర్పించాలని ఒత్తిడి తెస్తూ మహిళలను వేధిస్తున్నారని విమర్శించారు. 'సర్' పేరుతో బీహార్‌లో ఎన్నికలకు ముందు 65 లక్షల ఓట్లను తొలగిస్తే, అందులో 45 లక్షల మందికి పైగా మహిళలేనని తెలిపారు. వలస వెళ్లిన మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి ఓటుహక్కులను తొలగించారని ఆరోపించారు. చనిపోయిన తండ్రుల జనన ధ్రువపత్రాలు సమర్పించాలని కోరుతూ మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. వాతావరణ మార్పుల ప్రభావం మహిళలపై మరింత ఒత్తిడి పెంచుతోందని, ప్రకృతి విపత్తుల వల్ల నివాస సమస్యలు తీవ్రతరం అవుతున్నాయని తెలిపారు. అన్ని సహజ వనరులను ప్రైవేటీకరిస్తూ, విద్యను కాషాయీకరణ-ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్తున్న సర్కారు పాఠశాలల విలీనం, మూసివేతలతో బాలికలను చదువులకు దూరం చేస్తున్నదని విమర్శించారు. ఉన్నత విద్యలోనూ ఇదే పరిస్థితి నెలకొందన్నారు. మహిళల హక్కుల రక్షణకే ఐద్వా పోరాటమని, మనువాద సంస్కృతిని ప్రతిఘటిస్తూ ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని సుధా సుందర రామన్ పిలుపునిచ్చారు.

**ఎస్సీ, ఎస్టీలకు ఐద్వా అండ :**
**జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి**

ఎస్సీ, ఎస్టీ, మహిళల బతుకులపై బీజేపీ దాడి చేస్తోందని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్. పుణ్యవతి ఆరోపించారు. జీవించడానికి ఆ వర్గాలు చేస్తున్న పోరాటాలకు ఐద్వా అండగా ఉంటుందని ఆమె తెలిపారు. కార్మిక చట్టాలను రద్దు చేసి తెచ్చిన 4 లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో ఐద్వా పాల్గొంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఆర్బీఐ మైక్రో ఫైనాన్స్ కంపెనీలకు పావలా వడ్డీకి రుణాలిస్తే వారు రూ.2 నుంచి రూ.10 వడ్డీకి మహిళకిచ్చి పీడిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వేధింపులకు వ్యతిరేకంగా ఐద్వా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వివిధ రూపాల్లో పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. మనువాద సంస్కృతిని ప్రతిఘటిస్తూ మహిళలను అగ్నికణాలుగా మారుస్తున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరు కలిసి రావాలని ఆమె పిలుపునిచ్చారు.

**అభయహస్తం పొదుపు డబ్బులివ్వాలి :**
**మల్లు లక్ష్మి**

అభయహస్తం పథకంలో భాగంగా రాష్ట్రంలో మహిళలు పొదుపు చేసిన రూ.600 కోట్లను తిరిగి వారికివ్వాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అభయహస్తం పథకాన్ని పునరుద్ధరించాలని ఆమె కోరారు. 85 శాతం మంది మహిళలకు ఉపాధినిస్తున్న నరేగా పథకాన్ని పునరుద్ధరించాలని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక రాష్ట్రాల నిధులు కేంద్రానికి వెళుతున్న నేపథ్యంలో రాష్ట్రాల వాటాతో ముడిపెడుతూ తెచ్చిన వీబీజీరామ్ జీ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. పెద్దపల్లి జిల్లాలో 250 ఇండ్ల పట్టాలను ఐద్వా పోరాడి సాధించిందని తెలిపారు. ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి స్ఫూర్తితో భవిష్యత్తులో పోరాటాలు చేస్తామని ప్రకటించారు. పుస్తకాల విడుదల మీడియా సమావేశంలో ఐద్వా నాయకులు ఏడు ప్రచురణలను విడుదల చేశారు.

# రేషన్ డీలర్లకు జీతాలివ్వాలి

- ప్రభుత్వం ఇస్తున్న కమిషన్లు పెంచాలి
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



రాష్ట్రంలో రేషన్ డీలర్లకు ప్రభుత్వం ఇస్తున్న కమిషన్లు పెంచడంతో పాటు నెలసరి విధానంలో జీతాలు చెల్లించే వ్యవస్థను ప్రవేశపెట్టాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా హస్తినాపురం డివిజన్ పరిధిలోని కేకే గార్డెన్ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 17,200 మంది రేషన్ డీలర్లు పని చేస్తున్నారని, వీరందరూ తమ పరిధిలోని ప్రతి కుటుంబానికి సుపరిచితులని అన్నారు. దేశ జనాభాలో దాదాపు 85 శాతం కుటుంబాలతో రేషన్ డీలర్లకు నేరుగా సంబంధం ఉంటుందని వ్యాఖ్యానించారు. అయినప్పటికీ ప్రభుత్వాలు రేషన్ డీలర్ల సంక్షేమంపై తగినంత దృష్టి సారించడం లేదని విమర్శించారు. రేషన్ డీలర్లు చేస్తున్న డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. డీలర్లు కోరిన తొమ్మిది డిమాండ్లన్నింటినీ ఒకేసారి నెరవేర్చడం సాధ్యం కాకపోయినా, కనీసం ఐదు నుంచి ఆరు డిమాండ్లను తప్పకుండా అమలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రతి కుటుంబంలో ఒక్క వ్యక్తికి కేంద్ర ప్రభుత్వం ఐదు కిలోల బియ్యం ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క కిలో మాత్రమే ఇస్తోందన్నారు. రేషన్ వ్యవస్థను బలోపేతం చేయాలంటే డీలర్లకు ఆర్థిక భద్రత కల్పించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నైకోటి రాజు, జనరల్ సెక్రటరీ ఆవుల సంజీవ రెడ్డి, కోశాధికారి పారేపల్లి నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం మల్లికార్జున్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఎలక్ట్రిక్ వెహికల్ హబ్‌గా మారనుంది

- ఎనర్జీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిత్తల్

**ముద్ర, హైదరాబాద్ :**



తెలంగాణ రాష్ట్రం ఎలక్ట్రిక్ వెహికల్స్ హబ్‌గా, హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా మారే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర ఎనర్జీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిత్తల్ అన్నారు. గచ్చిబౌలి లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ప్రవేశపెట్టిన 'ఎలక్ట్రిక్ వెహికల్ బ్యాటరీ సస్టైనబిలిటీ ఇంజనీర్' కోర్సుకు సంబంధించిన మెటీరియల్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీ విప్లవం ఇప్పటికే ప్రారంభమైందని, నూతన మార్పులను ప్రజలు స్వాగతించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే వందలాది ఎలక్ట్రిక్ బస్సులు, వేలాది ఎలక్ట్రిక్ కార్లు రోడ్లపై పరుగులు పెడుతున్నాయని తెలిపారు. ఎక్కువ మైలేజ్, తక్కువ నిర్వహణ ఖర్చు, పర్యావరణహిత ప్రయోజనాలున్న ఎలక్ట్రిక్ వాహనాలే భవిష్యత్ అని చెప్పారు. ఈ సమావేశంలో కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్స్ ఇండియా, నేషనల్ కౌన్సిల్ ఫర్ వొకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సహకారంతో ఈ కోర్సును దేశంలో తొలిసారిగా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు బీటెక్ (మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్, ఎన్విరాన్మెంట్) విద్యార్థులు లేదా ఫైనల్ ఇయర్ విద్యార్థులు అర్హులని చెప్పారు. 150 గంటల థియరీ, 330 గంటల ప్రాక్టికల్స్, 120 గంటల ఆన్-ది-జాబ్ ట్రైనింగ్ ఉంటుందని, కేవలం రూ.20 వేల ఫీజుతో చేరవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఈఐ ప్రతినిధులు, వాసవీ మోటార్స్ ఎండీ వెంకటేశం, పలు ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యాసాగర్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్, గోకరాజు రంగరాజు, ఎం.ఎస్.వి.ఆర్, సెయిట్ పీటర్స్, విశ్వేశ్వరయ్య, అనురాగ్, విద్యాజ్యోతి, లార్డ్స్ ఇనిస్టిట్యూట్, ఆదిత్య, మహాత్మా గాంధీ , జె.బి.ఇనిస్టిట్యూట్, మెథడిస్ట్ తదితర ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్కీ సిబ్బంది, పలువురు హెడ్స్ ఆఫ్ ది డిపార్టుమెంట్స్ హాజరయ్యారు.



## నేటి నుంచి మహాజాతర

- మేడారానికి బయల్దేరిన పగిడిద్దరాజు, గోవిందరాజు
- మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహాజాతరకు పోటెత్తుతున్న భక్తులు

**ముద్ర, మేడారం:**

లక్షలాది మంది ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ మహాజాతరలో తొలి ఘట్టం బుధవారం ప్రారంభం కానుంది. మంగళవారం కొత్తగూడ మండలం పూనుగండ్ల గ్రామం నుంచి పగిడిద్దరాజును గిరిజన పూజారులు పాదయాత్రగా తీసుకువచ్చి బుధవారం ఉదయం మేడారానికి చేరుకున్నారు. అదేవిధంగా ఏటూనాగారం మండలం కొండాయి గ్రామం నుంచి గోవిందరాజులను కూడా పాదయాత్రగా తీసుకువస్తుండగా, వారు బుధవారం మేడారం చేరుకోనున్నారు. ఇద్దరు వనదేవతలు గద్దెలపై చేరుకున్న అనంతరం, తాడ్వాయి మండలం కన్నెపల్లి గ్రామం నుంచి సారలమ్మ దేవతను బుధవారం సాయంత్రం ఐదు గంటలకు జంపన్న వాగు మీదుగా గద్దెపైకి తీసుకువస్తారు. దీంతో తొలి ఘట్టానికి అంకురార్పణ జరుగనుంది.

**లక్షలాది మంది భక్తుల రాకతో కోలహలంగా మారిన మేడారం..**

అమ్మవార్లను మనసు నిండా దర్శించుకునేందుకు ఇప్పటికే లక్షలాది మంది భక్తులు మేడారానికి చేరుకుంటున్నారు. గద్దెల ప్రాంతానికి నాలుగు వైపులా దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర దట్టమైన అడవి ప్రాంతంలో భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి తాత్కాలిక డేరాలు వేసుకుని తిష్టవేశారు. మహాజాతర ఘట్టాన్ని విజయవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం, ములుగు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తిచేశాయి. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, రహదారుల మరమ్మతులు తదితర ఏర్పాట్లు చేపట్టారు. గద్దెల పునరుద్ధరణ పనులు పూర్తికాగా, ఆదివాసీ గిరిజన సంప్రదాయాన్ని ప్రతిబింబించే విధంగా ఏర్పాటు చేసిన కళారూపాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. మహాజాతర ప్రారంభంతో మేడారం ప్రాంతం భక్తుల కోలాహలంతో కిటకిటలాడుతోంది.

# కాలంతో పాటు పార్టీలో మార్పు రావాలి

- సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల్లా నడిపిస్తున్న చంద్రబాబు
- పార్లమెంటరీ కమిటీల్లో 83శాతం కొత్తవారికే చోటు
- కూటమిలో చిచ్చు పెట్టేందుకు వైకాపా కుట్రలు
- కార్యకర్తల కోసం మూడు ప్రాంతీయ శిక్షణా కేంద్రాలు
- మాట తప్పడం, మడమ తిప్పడం తెదేపా రక్తంలోనే లేదు..
- మంత్రి నారా లోకేశ్

**ముద్ర, అమరావతి :**



మారుతున్న కాలానికి అనుగుణంగా తెలుగుదేశం పార్టీలో సంస్కరణలు రావాలని, అప్పుడే వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్లమెంటరీ కమిటీల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు.

**సామాజిక న్యాయమే లక్ష్యం..**

పేదరికం లేని సమాజ స్థాపనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని లోకేశ్ అన్నారు. పదవుల కేటాయింపులో సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్నామని, అందులో భాగంగానే పార్లమెంటరీ కమిటీల్లో 83 శాతం మంది కొత్తవారికి అవకాశం కల్పించామని తెలిపారు. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు.

**కూటమి నేతలకు దిశానిర్దేశం..**

తెదేపా, జనసేన, భాజపాలతో కూడిన కూటమిలో చిన్నపాటి విభేదాలు రావడం సహజమని, వాటిని పార్లమెంటరీ కమిటీ నేతలు సమన్వయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. "కూటమిలో చిచ్చు పెట్టేందుకు వైకాపా నేతలు కుట్రలు చేస్తారు. మనం కలసి కట్టుగా ఉండి వాటిని తిప్పికొట్టాలి" అని పిలుపునిచ్చారు.

**కార్యకర్తలకు శిక్షణ-ప్రాంతీయ కేంద్రాలు**

పార్టీ శ్రేణులను నైపుణ్యవంతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రవ్యాప్తంగా మూడు ప్రాంతీయ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు లోకేశ్ ప్రకటించారు. ఈ కేంద్రాలు అమరావతి, విశాఖపట్నం, తిరుపతిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

**కీలక వ్యాఖ్యలు**

అభివృద్ధిసంక్షేమం : చంద్రబాబు నాయుడు నేతృత్వంలో సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా సాగుతున్నాయని అన్నారు.

మహిళా గౌరవం : పార్టీలో మహిళలకు సముచిత గౌరవం ఇచ్చి, వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

కార్యకర్తలే స్ఫూర్తి : తోట చంద్రయ్య, మంజుల వంటి కార్యకర్తల త్యాగాలు పార్టీకి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

చివరిగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి వేగానికి అనుగుణంగా పనిచేయడం ఒక సవాలుగా మారిందని, ప్రజలకు సేవ చేయడంలో ప్రతి నాయకుడు నిరంతరం తపించాలని లోకేశ్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

# కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- నేడు పఠాన్‌చెరువులో ఇంటిగ్రేటెడ్ భవనానికి శంకుస్థాపన

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ప్రజలకు వేగవంతంగా, పారదర్శకంగా, అత్యుత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతోనే రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. గత పాలకుల స్వార్థపూరిత నిర్ణయాల వల్ల రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందని విమర్శించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ఈ వ్యవస్థను సంస్కరిస్తూ రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామన్నారు. మంగళవారం సచివాలయంలో ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల ఏర్పాటుపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి, ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్లుగా విభజించి, ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని వెల్లడించారు. ఆయా భవనాల నిర్మాణంతో పాటు ఐదేళ్ల నిర్వహణ బాధ్యతను కూడా ఆయా సంస్థలే తీసుకుంటున్నాయని తెలిపారు.

**మూడు నుంచి ఐదెకరాల స్థలంలో..**

మూడు నుంచి ఐదు ఎకరాల స్థలంలో కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నామని, వివాహ రిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజ్ హాల్, గర్భిణీలు, వృద్ధుల కోసం ప్రత్యేక వసతులు, విశాలమైన వెయిటింగ్ ఏరియా, మహిళల కోసం ఫీడింగ్ రూమ్, చిన్నపిల్లల కోసం క్రెచ్, వృద్ధులు, దివ్యాంగుల కోసం ఆధునిక లిఫ్ట్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన కార్యాలయాలకు త్వరలో శంకుస్థాపనలు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండో విడతలో జిల్లా కేంద్రాల్లో కూడా ఇంటిగ్రేటెడ్ భవనాల నిర్మాణానికి కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఈ ఏడాది జూన్ 2 నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల మేడ్చల్ జిల్లాలో భవనానికి శంకుస్థాపన జరిగిందని, పఠాన్‌చెరువుశంకరపల్లి ప్రధాన రహదారి సమీపంలో రాజపుష్ప కన్‌స్ట్రక్షన్ నిర్మించే ఇంటిగ్రేటెడ్ భవనానికి నేడు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.

**స్లాట్ బుకింగ్, ఈ ఆధార్ సంతకం వంటి సదుపాయాలు..**

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, ఈ-ఆధార్ సంతకం వంటి సౌకర్యాలతో ప్రజల సమయాన్ని ఎంతో ఆదా చేస్తున్నామని చెప్పారు. రెవెన్యూ శాఖలో చేపడుతున్న ఈ సంస్కరణలు కేవలం కార్యాలయాల మార్పు మాత్రమే కాకుండా, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే కీలక సంస్కరణలుగా నిలుస్తాయని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అమలు చేయాలి

- సీఎస్‌కు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ వినతి

**ముద్ర, హైదరాబాద్ :**



రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మరియు వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత ఆరోగ్య పథకాన్ని వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో అన్నిరకాల వ్యాధులకు అపరిమితంగా నగదు రహిత వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ఐపీ, ఓపీ చికిత్సలకు ప్రభుత్వంతో పాటు ఉద్యోగులు కూడా సమానంగా నెలవారీ కాంట్రిబూషన్ చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి నేతృత్వంలో ప్రతినిధులు కలిసి ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస్) అమలుపై వినతిపత్రం అందజేశారు. ఎంపానెల్ చేసిన ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందించేందుకు రూపొందించిన విధానం కొన్ని కారణాల వల్ల అమలుకాక రీయింబర్స్‌మెంట్ విధానమే కొనసాగుతోందని వివరించారు. ప్రైవేట్ ఆసుపత్రులు హెల్త్ కార్డులు అంగీకరించకపోవడం, బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర ఆలస్యం జరగడం వల్ల ఈహెచ్ఎస్ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. ప్రస్తుత రీయింబర్స్‌మెంట్ విధానం ఉద్యోగులకు అనుకూలంగా లేదని, అత్యవసర చికిత్సలకు ముందుగా అధిక వడ్డీతో అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గుండె, క్యాన్సర్, కిడ్నీ మార్పిడి వంటి పెద్ద చికిత్సలకు గరిష్ట పరిమితి రూ.2లక్షలే ఉండటంతో భారంగా మారుతోందన్నారు. రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు నెలవారీ కాంట్రిబూషన్ చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారని, అదే మొత్తాన్ని ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌గా చెల్లించాలని సూచించారు. ఈ ప్రతిపాదనపై సీఎస్ సానుకూలంగా స్పందిస్తూ సంబంధిత శాఖలతో సంప్రదించి తుది నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కె.రామకృష్ణ, రమేష్ పాక, పూల్‌సింగ్ చౌహాన్, గరికె ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
28.01.2026 బుధవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### క్రీడా ప్రపంచంలో వింతలు

ఒకే ఒలింపిక్స్‌లో రెండు దేశాల తరపున: 1896 ఒలింపిక్స్‌లో టెన్నిస్ ప్లేయర్ జాన్ పీయస్ బోలాండ్ అనుకోకుండా వేర్వేరు భాగస్వాములతో కలిసి రెండు వేర్వేరు దేశాల (బ్రిటన్, జర్మనీ) తరపున మెడల్స్ గెలిచారు.



# టీ20 వరల్డ్‌కప్ సమరానికి కౌంట్‌డౌన్

- వార్మప్ మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల..
- ఫిబ్రవరి 4న దక్షిణాఫ్రికాతో భారత్ ఢీ!
- చిన్న జట్లకు ప్రాక్టీస్ కోసం భారత-ఏ జట్టును కేటాయించిన నిర్వాహకులు
- ఫిబ్రవరి 2 నుంచి 6 వరకు భారత్, శ్రీలంకలో మ్యాచులు
- బంగ్లాదేశ్ అవుట్ - స్కాట్లాండ్ ఇన్
- ఫిబ్రవరి 7 నుంచి కొలంబో వేదికగా పాకిస్థాన్-న్యూజిలాండ్ మధ్య తొలి మ్యాచ్
- వాంఖడేలో యూఏఈతో భారత్ తొలి మ్యాచ్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

2026 టీ20 ప్రపంచకప్‌కు ముందు నిర్వహించనున్న వార్మప్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. బంగ్లాదేశ్ టోర్నీ నుంచి తప్పుకోవడం, ఆ స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం కల్పించడంతో ఏర్పడిన అనిశ్చితి కారణంగా ఈ షెడ్యూల్ ప్రకటన కొంత ఆలస్యమైంది. చివరకు అన్ని జట్లతో కలిపి ప్రాక్టీస్ మ్యాచ్‌ల రూపరేఖ ఖరారైంది.
డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనున్న భారత్ ఈ వార్మప్ దశలో ఒక్క మ్యాచ్‌కే పరిమితమైంది. ఫిబ్రవరి 4న గత ఎడిషన్ రన్నరప్ దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది. ఈ హైప్రొఫైల్ పోరు నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతుంది.
అదే సమయంలో భారతఏ జట్టుకు రెండు వార్మప్ మ్యాచ్‌లు కేటాయించారు. టోర్నీలో పాల్గొనే చిన్న జట్లకు మ్యాచ్ ప్రాక్టీస్ అందించడమే లక్ష్యంగా ఈ పోరాటాలను షెడ్యూల్ చేశారు. ఫిబ్రవరి 2న భారతఏ జట్టు నవీ ముంబైలో యూఎస్ఏతో తలపడనుండగా, ఫిబ్రవరి 6న బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్‌లో నమీబియాతో పోటీపడనుంది.
మొత్తంగా ప్రపంచకప్ ప్రారంభానికి ముందు 16 వార్మప్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 2 నుంచి 6 వరకు భారత్, శ్రీలంక, బెంగళూరు, చెన్నై వంటి వేదికలపై ఈ పోరాటాలు సాగనున్నాయి. ఆఫ్ఘనిస్తాన్, స్కాట్లాండ్, వెస్టిండీస్, పాకిస్తాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి జట్లతో పాటు నెదర్లాండ్స్, నేపాల్, ఒమన్, యూఎస్ఏ, ఇటలీ, కెనడా వంటి జట్లు కూడా ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో పాల్గొంటాయి.
వార్మప్ మ్యాచ్‌లు ముగిసిన అనంతరం ఫిబ్రవరి 7 నుంచి టీ20 వరల్డ్‌కప్ అసలు సమరం ప్రారంభమవుతుంది. టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో పాకిస్తాన్, న్యూజిలాండ్ జట్లు కొలొంబో వేదికగా ఢీకొంటాయి. అదే రోజున భారత్ తమ తొలి లీగ్ మ్యాచ్‌ను యూఎస్ఏతో ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఆడనుంది. మెగా టోర్నీకి ముందు ఈ వార్మప్ మ్యాచ్‌లు అన్ని జట్లకూ కీలక సిద్ధత వేదికగా నిలవనున్నాయి.




# పీసీబీని దోచుకున్న దొంగ 'నఖ్వీ'

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**



పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)లో భారీ స్థాయిలో ఆర్థిక అక్రమాలు జరిగాయని పాకిస్థాన్‌కు చెందిన ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ జాహిద్ గిష్కోరి సంచలన ఆరోపణలు చేశారు. ప్రస్తుత పీసీబీ ఛైర్మన్ మోహ్‌సిన్ నఖ్వీ పదవీకాలంలోనే ఈ అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వివరాలతో సోషల్ మీడియా వేదికగా వీడియోను విడుదల చేశారు.
జాహిద్ గిష్కోరి వెల్లడించిన సమాచారం ప్రకారం, పారదర్శక వేలం ప్రక్రియ లేకుండానే పీసీబీ ఉన్నతాధికారులు తమకు సన్నిహితంగా ఉన్న రెండు ప్రైవేట్ సంస్థలకు భారీ విలువైన కాంట్రాక్టులను కట్టబెట్టారు. స్టేడియాల ఆధునీకరణ పేరుతో కోట్ల రూపాయలు పక్కదారి పట్టినట్లు ఆరోపించారు. ముఖ్యంగా ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ కోసం చేపట్టిన స్టేడియాల పునరుద్ధరణ పనుల్లో అంచనాల కంటే అధికంగా వ్యయం చేసినట్లు తెలిపారు. టెండర్లు పిలవకుండా పరిచయమున్న కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారని, పీసీబీకి స్వంత లీగల్ టీమ్ ఉన్నప్పటికీ బయట లా సంస్థలు, కన్సల్టెంట్లకు కోట్ల రూపాయలు ఫీజులుగా చెల్లించినట్లు గిష్కోరి పేర్కొన్నారు. అంతర్గత ఆడిట్ విభాగాన్ని తప్పుదోవ పట్టించేలా రికార్డులు తయారు చేసినట్లు కూడా ఆరోపణలు చేశారు.
సుమారు రూ.600 కోట్ల వ్యయానికి సంబంధించిన సరైన రశీదులు, పత్రాలు లేవని, పీఎస్ఎల్ బ్రాడ్‌కాస్టింగ్ హక్కుల విషయంలోనూ అనేక అవకతవకలు జరిగాయని ఆయన వెల్లడించారు. ఈ ఆరోపణలు పాకిస్థాన్ క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.

# బంగ్లాదేశ్‌కు ఐసీసీ మరో దెబ్బ...
## జర్నలిస్టులకు భారత్ వీసాలు నిరాకరణ

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

బంగ్లాదేశ్‌కు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మరోసారి షాక్ ఇచ్చింది. భారత్‌లో జరగనున్న టీ20 ప్రపంచ కప్ నేపథ్యంలో బంగ్లాదేశ్‌కు చెందిన జర్నలిస్టులకు వీసాలు మంజూరు చేయడానికి నిరాకరించింది. భద్రతా కారణాలనే సాకుగా చూపుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఐసీసీ వర్గాలు స్పష్టం చేశాయి.
ఇటీవల భారత్‌లో భద్రత లేదంటూ బంగ్లాదేశ్ ప్రభుత్వం పదేపదే వ్యాఖ్యలు చేస్తుండటంతో, అదే అంశాన్ని ఆధారంగా తీసుకుని జర్నలిస్టులకు వీసాలు ఇవ్వలేదని ఐసీసీ అధికారి ఒకరు జాతీయ మీడియాకు తెలిపారు. భారత్‌కు రావడం సురక్షితం కాదన్న వాదనను బంగ్లా ప్రభుత్వం కొనసాగిస్తుండటమే ఈ నిర్ణయానికి కారణమని ఆయన వెల్లడించారు. ఈ పరిణామంపై బంగ్లాదేశ్ మీడియా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఐసీసీ ఈవెంట్ల కవరేజీలో ఇది పెద్ద అడ్డంకిగా మారుతుందని, ముఖ్యంగా శ్రీలంకలో జరిగే టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐసీసీ చరిత్రలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని బంగ్లా జర్నలిస్టు వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.
గమనార్హమేమిటంటే, భారత్‌లో జరగాల్సిన టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లకు భద్రతా కారణాలు చూపుతూ బంగ్లాదేశ్ జట్టు టోర్నీకి దూరమైన సంగతి తెలిసిందే. ఇరుదేశాల మధ్య ఇటీవల నెలకొన్న ఉద్రిక్తతలను ప్రస్తావిస్తూ, తమ జట్టును భారత్‌కు పంపడం సాధ్యం కాదని బంగ్లాదేశ్ ఐసీసీకి స్పష్టం చేసింది. మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని కోరినా, ఐసీసీ ఆ అభ్యర్థనను తిరస్కరించింది. ఐసీసీ భద్రతా అంచనా నివేదికలో భారత్‌లో బంగ్లా జట్టుకు ఎలాంటి ప్రత్యక్ష ముప్పు లేదని తేలినా, బంగ్లాదేశ్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. దీంతో ప్రత్యామ్నాయంగా స్కాట్లాండ్ జట్టును టోర్నీకి ఎంపిక చేసింది ఐసీసీ. తాజా జర్నలిస్టుల వీసాల వివాదంతో ఈ అంశం మరోసారి అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# టీమిండియా దెబ్బకు కివీస్ కుదేలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐసీసీ టీ20 ప్రపంచకప్-2026కు ముందు న్యూజిలాండ్ జట్టుకు భారత్ పర్యటన ఊహించని ఎదురుదెబ్బగా మారింది. వన్డే సిరీస్‌ను గెలిచి ధీమాతో టీ20ల బరిలోకి దిగిన బ్లాక్ క్యాప్స్‌కు ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో వరుసగా మూడు ఓటములు ఎదురయ్యాయి. ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్ చేజారిపోయింది. ఈ మ్యాచ్‌లలో భారత్‌కు గట్టి పోటీ ఇవ్వడంలో న్యూజిలాండ్ విఫలమైంది. ఈ పరాజయాల నేపథ్యంలో జట్టు మేనేజ్‌మెంట్ కీలక నిర్ణయం తీసుకుంది. యువ పేసర్ క్రిస్టియన్ క్లార్క్, బ్యాటర్ టీమ్ రాబిన్సన్‌లను జట్టు నుంచి విడుదల చేసి స్వదేశానికి పంపింది. వారి స్థానాల్లో అనుభవజ్ఞులు జిమ్మీ నీషమ్, లాకీ ఫెర్గూసన్‌లను జట్టులోకి తీసుకుంది. చివరి టీ20కి ఫిన్ అలెన్ అందుబాటులోకి వస్తాడని న్యూజిలాండ్ క్రికెట్ ఎక్స్ వేదికగా వెల్లడించింది.
క్రిస్టియన్ క్లార్క్ నాగ్‌పూర్‌లో జరిగిన తొలి టీ20తో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ఆ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లలో 40 పరుగులు ఇచ్చి ఒక వికెట్ సాధించాడు. అదే మ్యాచ్‌లో టీమ్ రాబిన్సన్ 15 బంతుల్లో 21 పరుగులు చేశాడు. రెండో టీ20 నుంచి వీరిద్దరిని పక్కన పెట్టి మ్యాట్ హెన్రీ, టిమ్ సీఫెర్ట్‌లకు అవకాశం ఇచ్చారు. అనంతరం ఈ ఇద్దరిని జట్టు నుంచి విడుదల చేశారు.
బిగ్ బాష్ లీగ్ కారణంగా సిరీస్ ప్రారంభంలో దూరమైన ఫిన్ అలెన్, చివరి మ్యాచ్‌కు జట్టుతో కలవనున్నాడు. అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా గుర్తింపు పొందిన అలెన్, బిగ్ బాష్‌లో పెర్త్ స్కార్చర్స్ తరఫున 11 మ్యాచ్‌ల్లో 466 పరుగులు చేశాడు. అతని రాకతో న్యూజిలాండ్ బ్యాటింగ్ విభాగానికి బలం చేకూరనుంది.

**న్యూజిలాండ్ టీ20 జట్టు:**
మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), డెవాన్ కాన్వే, టిమ్ సీఫెర్ట్ (వికెట్ కీపర్), రచిన్ రవీంద్ర, గ్లెన్ ఫిలిప్స్, డారిల్ మిచెల్, మార్క్ చాప్‌మన్, జాకరీ ఫౌల్క్స్, మ్యాట్ హెన్రీ, ఇష్ సోధి, జాకబ్ డఫీ, జిమ్మీ నీషమ్, లాకీ ఫెర్గూసన్, కైల్ జామిసన్, మైఖేల్ బ్రేస్‌వెల్, బెవాన్ జాకబ్స్, ఫిన్ అలెన్ (చివరి టీ20కు మాత్రమే).




# జింబాబ్వేపై భారత్ దూకుడు ఆరంభం




**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:** అండర్-19 ప్రపంచకప్‌లో భాగంగా గ్రూప్-2 సూపర్ సిక్స్ దశలో భారత్, జింబాబ్వే జట్ల మధ్య కీలక పోరు జరుగుతోంది. బులావయోలోని క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు ఆరంభం నుంచే దూకుడుగా ఆడుతూ స్కోర్‌బోర్డును పరుగులు పెట్టించింది. పవర్‌ప్లేలోనే భారత బ్యాటర్లు జింబాబ్వే బౌలర్లపై ఆధిపత్యం చెలాయించారు. తొలి 10 ఓవర్లలోనే భారత్ 100 పరుగుల మార్క్‌ను దాటడం ద్వారా దాడి తీవ్రతను చాటింది. అయితే ఆ తర్వాత జింబాబ్వే బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో వెంటవెంటనే మూడు కీలక వికెట్లు పడిపోయాయి.
భారత ఇన్నింగ్స్‌ను వైభవ్ సూర్యవంశీ, ఆరోన్ జార్జ్‌లు ఆరంభించారు. రెండో ఓవర్‌లో మైఖేల్ బ్లిగ్నాట్ వేసిన ఓవర్‌లో ఇద్దరూ కలిసి 15 పరుగులు రాబట్టి ఆరంభం నుంచే జోరు చూపారు. నాలుగు ఓవర్లకే ఓపెనింగ్ జోడీ 44 పరుగులు సాధించింది. అయిదో ఓవర్ తొలి బంతికి ఆరోన్ జార్జ్ భారీ షాట్‌కు యత్నించి పనాషే మజాయ్ బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. అప్పటికి భారత్ ఆరు ఓవర్లలో 59 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో మరోసారి వైభవ్ సూర్యవంశీ తన దూకుడు బ్యాటింగ్‌తో మెప్పించాడు. కేవలం 24 బంతుల్లోనే నాలుగు సిక్సర్లు, నాలుగు ఫోర్లతో అర్ధశతకం పూర్తి చేసి జట్టుకు వేగవంతమైన ఆరంభం అందించాడు. 11వ ఓవర్ తొలి బంతికే భారత్ 100 పరుగుల మైలురాయిని చేరుకుంది. అదే ఓవర్‌లో తతండా చిముగోరో బౌలింగ్‌లో ఆయుష్ మ్హాత్రే (21), వైభవ్ సూర్యవంశీ (52) వరుసగా అవుట్ అయ్యారు.
వైభవ్ సూర్యవంశీ సాధించిన ఈ అర్ధశతకం ఐసీసీ అండర్-19 వరల్డ్‌కప్ 2026లో నమోదైన వేగవంతమైన హాఫ్ సెంచరీల జాబితాలో చోటు దక్కించుకుంది. ఈ టోర్నీలో 23 బంతుల్లో అర్ధశతకం సాధించిన విల్ మలజుక్ అగ్రస్థానంలో ఉండగా, 24 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన ఆయుష్ మ్హాత్రే (న్యూజిలాండ్‌పై), వైభవ్ సూర్యవంశీ (జింబాబ్వేపై) సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. అంతకుముందు బంగ్లాదేశ్‌పై వైభవ్ సూర్యవంశీ 30 బంతుల్లో, స్కాట్లాండ్‌కు చెందిన బెన్ మేయెస్ 32 బంతుల్లో అర్ధశతకాలు సాధించారు. ఈ మ్యాచ్‌లో విజయం సాధిస్తే భారత అండర్-19 జట్టు సెమీ ఫైనల్ బెర్త్‌ను దాదాపు ఖరారు చేసుకుంటుంది. లీగ్ దశలో ఒక్క మ్యాచ్ కూడా గెలవకుండానే అదృష్టవశాత్తూ సూపర్ సిక్స్‌కు చేరుకున్న జింబాబ్వేకు ఇది 'చావో రేవో' పోరుగా మారింది. మరోవైపు భారత్ గెలిస్తే ఎలాంటి నెట్ రన్‌రేట్ లెక్కలు లేకుండా నేరుగా సెమీ ఫైనల్స్‌కు చేరనుంది.

# "జట్టుకు నా అవసరం లేదనిపిస్తే
# జరిగేది అదే..

- **కేఎల్ రాహుల్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

టీమిండియా సీనియర్ క్రికెటర్ కేఎల్ రాహుల్ తన రిటైర్మెంట్‌పై తొలిసారి స్పష్టంగా స్పందించాడు. గతంలో ఎన్నో సందర్భాల్లో ఆటకు వీడ్కోలు పలకాలనే ఆలోచన తనకు వచ్చినట్లు వెల్లడించిన అతడు, తన విషయంలో రిటైర్మెంట్ నిర్ణయం పెద్దగా క్లిష్టం కాదని వ్యాఖ్యానించాడు. కర్ణాటకకు చెందిన రాహుల్ 2014లో భారత జట్టులోకి అడుగుపెట్టి అంతర్జాతీయ క్రికెట్‌లో తన ప్రయాణాన్ని ప్రారంభించాడు.
ఇప్పటి వరకు భారత్ తరఫున 67 టెస్టులు, 94 వన్డేలు, 72 టీ20 మ్యాచ్‌లు ఆడిన రాహుల్.. మూడు ఫార్మాట్లలోనూ కీలక పరుగులు అందించాడు. టెస్టుల్లో 4053, వన్డేల్లో 3360, టీ20ల్లో 2265 పరుగులు చేశాడు. ఈ కుడిచేతివాటం బ్యాటర్ ఖాతాలో టెస్టుల్లో 11, వన్డేల్లో 8, టీ20ల్లో 2 శతకాలు ఉన్నాయి.
కాలక్రమంలో జట్టులోని అవసరాలకు అనుగుణంగా తన పాత్రను మార్చుకున్న రాహుల్.. ప్రస్తుతం టెస్టు, వన్డే జట్లలో కీలకంగా కొనసాగుతున్నాడు. యాభై ఓవర్ల ఫార్మాట్‌లో వికెట్‌కీపర్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. అయితే, గతంలో గాయాల సమస్యలు, ఫామ్‌లో నిలకడలేమి కారణంగా ఓపెనర్ స్థానం నుంచి మిడిలార్డర్‌కు మారాల్సి వచ్చింది. కొన్ని సార్లు మళ్లీ ఓపెనర్‌గా తిరిగి వచ్చి తన సామర్థ్యాన్ని చాటాడు.
తాజాగా ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్‌తో జరిగిన సంభాషణలో రాహుల్ తన ఆలోచనలను బహిర్గతం చేశాడు. ''రిటైర్మెంట్ గురించి నేను ఇప్పటికే చాలాసార్లు ఆలోచించాను. మన పట్ల మనం నిజాయితీగా ఉంటే సరైన సమయం ఎప్పుడో మనకే అర్థమవుతుంది. అందుకే ఈ నిర్ణయాన్ని ఎక్కువగా ఆలస్యం చేయాల్సిన అవసరం ఉండదు'' అని తెలిపాడు.
ప్రస్తుతానికి జట్టులో తన స్థానానికి ఎలాంటి ముప్పు లేదని, అయితే అవసరం లేదనిపించిన క్షణమే ఆటకు వీడ్కోలు పలుకుతానని రాహుల్ స్పష్టం చేశాడు. ''ఇప్పటికీ నా రిటైర్మెంట్‌కు కొంత సమయం ఉంది. కానీ ఆటను వదిలేయాలని అనిపిస్తే అదే సరైన నిర్ణయం. క్రికెట్ ఒక్కటే జీవితం కాదు. కుటుంబం, వ్యక్తిగత బాధ్యతలు కూడా ఉంటాయి. నాకు కూతురు పుట్టిన తర్వాత జీవితంపై నా దృష్టికోణం పూర్తిగా మారింది'' అని చెప్పాడు.
గాయాల సమయంలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని కూడా రాహుల్ గుర్తు చేసుకున్నాడు. ''ఫిజియో, సర్జన్ల చికిత్సలతో శరీరం మాత్రమే కాదు, మనసూ అలసిపోతుంది. ఇక చాలు అని మనసు చెప్పే దశలు వస్తాయి. అదృష్టవశాత్తూ క్రికెట్ మనకు ఆర్థిక భద్రత ఇస్తుంది. అయినా, ఆ మానసిక స్థితిని దాటుకుని మళ్లీ మైదానంలోకి దిగడమే అసలైన సవాల్'' అని వివరించాడు.
ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో రాహుల్ చివరిసారిగా టీమిండియా తరఫున బరిలోకి దిగాడు. భవిష్యత్తులోనూ జట్టు అవసరాలకే తాను ప్రాధాన్యం ఇస్తానని అతడి మాటల్లో స్పష్టంగా కనిపించింది.




# తిలక్ వర్మ
## అమాయకుడు కాదు: రోహిత్ శర్మ

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

టీమిండియా యువ బ్యాటర్ తిలక్ వర్మపై మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బయటకు అమాయకంగా కనిపించినా, తిలక్ అసలు అమాయకుడు కాదని, మ్యాచ్ పరిస్థితిని వేగంగా అర్థం చేసుకునే తెలివైన ఆటగాడని రోహిత్ స్పష్టం చేశారు. కీలక సందర్భాల్లో బాధ్యత తీసుకుని ఆడే సామర్థ్యం అతనిలో స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు.




ముంబై ఇండియన్స్ తరఫున తిలక్ వర్మను తొలిసారి చూసినప్పుడే అతని మైండ్‌సెట్ భిన్నంగా అనిపించిందని రోహిత్ గుర్తుచేశారు. ఒత్తిడి పరిస్థితుల్లోనూ ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకుంటాడని, పెద్ద మ్యాచ్‌ల్లో రాణించే గుణం అతనికి సహజంగానే ఉందని చెప్పారు. ఆసియా కప్ ఫైనల్ వంటి కీలక పోరులో తిలక్ చూపిన ప్రదర్శన అతన్ని బిగ్ మ్యాచ్ ప్లేయర్‌గా నిలబెట్టిందని రోహిత్ పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
28.01.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### క్రీడా ప్రపంచంలో వింతలు

మరగుజ్జు ప్లేయర్: 1951లో ఎడ్డీ గైడెల్ అనే కేవలం 3 అడుగుల 7 అంగుళాల ఎత్తు ఉన్న వ్యక్తి మేజర్ లీగ్ బేస్ బాల్ మ్యాచ్ ఆడి రికార్డు సృష్టించాడు.





## పోస్ట్ ప్రొడక్షన్‌లోకి ‘ఉస్తాద్ భగత్ సింగ్’

- డబ్బింగ్ మొదలు.. పవన్ కళ్యాణ్ వాయిస్‌కు కౌంట్‌డౌన్

తెలుగు సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్’ కీలకమైన నిర్మాణాంతర దశలోకి ప్రవేశించింది. శుభ ముహూర్తంలో డబ్బింగ్ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మాస్‌కు నచ్చే సంభాషణలు, శక్తివంతమైన కథనంతో పేరు తెచ్చుకున్న హరీష్ శంకర్ ఈ చిత్రాన్ని కల్ట్ స్థాయిలో నిలిపేందుకు కృషి చేస్తున్నారు.‘గబ్బర్ సింగ్’ వంటి సంచలన విజయం తర్వాత పవన్‌కళ్యాణ్–హరీష్‌శంకర్ కలయికలో వస్తున్న చిత్రం కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవి శంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణాంతర పనులను హరీష్ శంకర్ వేగవంతం చేశారు.ప్రేక్షకులను ఉర్రూతలూగించే సంభాషణలు, థియేటర్‌లో ఈలలు వేయించే సన్నివేశాలు చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. పవన్ కళ్యాణ్ త్వరలో డబ్బింగ్‌లో పాల్గొననున్నారని సమాచారం. ఈ అప్‌డేట్‌తో అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. సోషల్ మీడియాలో ‘పూనకాలు లోడింగ్’ అంటూ కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి.

## చిరు వ్యాఖ్యలపై చిన్మయి ఘాటు స్పందన



సినీ పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ అనేదే లేదని, మహిళలు కఠినంగా, ప్రొఫెషనల్‌గా వ్యవహరిస్తే ఎవరూ వారిని ఇబ్బంది పెట్టరని మెగాస్టార్ చిరంజీవి ఇటీవల చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చకు దారితీశాయి. ఆయన మాటలకు కొందరు మద్దతు పలికినా, మరికొందరు మాత్రం కాస్టింగ్ కౌచ్ సమస్యను అలా కొట్టిపారేయడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో కాస్టింగ్ కౌచ్‌పై ఎప్పటినుంచో బహిరంగంగా మాట్లాడుతున్న గాయని, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి స్పందించారు. సినీ పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ లేదనడం వాస్తవానికి దూరమని ఆమె స్పష్టం చేశారు. తనకు తెలిసిన అనేక సంఘటనలను ఉదాహరణగా పేర్కొంటూ, ఇది ఇప్పటికీ తీవ్రంగా ఉన్న సమస్యేనని చెప్పారు.

చిరంజీవి తరానికి చెందిన సీనియర్ నటులు మహిళలతో మర్యాదగా, కుటుంబ సభ్యుల్లా వ్యవహరించి ఉండొచ్చని చిన్మయి పేర్కొన్నారు. వారు దిగ్గజాలుగా పేరు తెచ్చుకున్నవారేనని అంగీకరించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో మాత్రం ఇండస్ట్రీలో మహిళలపై లైంగిక వేధింపులు మరింత భయానకంగా మారాయని వ్యాఖ్యానించారు.

‘మీటూ’ ఉద్యమంలో భాగంగా మహిళలు తమ అనుభవాలను బహిరంగంగా వెల్లడించడాన్ని తప్పుబట్టడం విచిత్రమని చిన్మయి అన్నారు. షావుకారు జానకి వంటి మహిళలే ఈ ఉద్యమాన్ని విమర్శించడం బాధాకరమని పేర్కొన్నారు. అలాగే సినీ రంగంలో వినిపించే ‘ఫుల్ కమిట్మెంట్’ అనే పదానికి వేరే అర్థం ఉన్నట్టుగా పరిస్థితులు తయారయ్యాయని ఆమె అభిప్రాయపడ్డారు.

తనకు తెలిసిన ఒక ఘటనను వివరిస్తూ, ఓ సంగీత దర్శకుడు గాయనిపై లైంగిక దాడికి ప్రయత్నించడంతో ఆమె గదిలో తలుపులు వేసుకుని ఉండాల్సి వచ్చిందని, ఆ సమయంలో ఓ సీనియర్ వ్యక్తి జోక్యంతో ఆమెకు రక్షణ లభించిందని తెలిపారు. అలాగే కొందరు పురుష గాయకులు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా, వ్యక్తిగత అవయవాల ఫొటోలు పంపి అనుచితంగా కోరిన సంఘటనలూ ఉన్నాయని చెప్పారు.

వైరముత్తు తన తల్లి సమక్షంలోనే తనను లైంగికంగా వేధించాడని, అది తన సమ్మతితో జరిగినది కాదని చిన్మయి మరోసారి స్పష్టం చేశారు. ఆయనను గురువులా భావించి గౌరవించినప్పటికీ, తనపై చేసిన ప్రవర్తన తీవ్రంగా బాధించిందన్నారు. సినీ పరిశ్రమలో చాలామంది పురుషులు మహిళలకు పని ఇస్తే ప్రతిఫలంగా శృంగారాన్ని ఆశిస్తారనే భావనతోనే వ్యవహరిస్తున్నారని ఆమె తీవ్రంగా విమర్శించారు.

## గాసిప్స్‌కు చెక్ పెట్టిన అక్కినేని జంట

నటి శోభిత ధులిపాల, హీరో నాగ చైతన్య దంపతులపై ఇటీవల సోషల్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ వర్గాల్లో చక్కర్లు కొడుతున్న వార్తలు చర్చనీయాంశంగా మారాయి. పెళ్లి తర్వాత తొలిసారి తల్లిదండ్రులు కాబోతున్నారంటూ వస్తున్న గాసిప్‌లు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. డిసెంబర్ 4, 2025న తమ తొలి వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్న వెంటనే ఈ ప్రచారం ఊపందుకోవడం మరింత హైప్‌కు కారణమైంది.

ముంబైలో జరిగిన ఓ పబ్లిక్ ఈవెంట్‌లో శోభిత కనిపించిన లుక్‌నే ఈ రూమర్స్‌కు బీజంగా మారింది. లూజ్ ఫిట్టింగ్ చీరలో ఆమె హాజరుకావడంతో ‘బేబీ బంప్ దాచేందుకే ఇలా డ్రెస్ చేసిందా?’ అంటూ నెటిజన్లు ఊహాగానాలు మొదలుపెట్టారు. ఇటీవల ఆమె ఎంచుకుంటున్న యాంటీ-ఫిట్ ఔట్‌ఫిట్స్ కూడా ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చాయి.

అయితే ఈ వార్తలపై శోభిత–చైతన్యకు సన్నిహిత వర్గాలు స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. గర్భవతి అన్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, అది పూర్తిగా ఫ్యాషన్ ఎంపికకు సంబంధించిన విషయమేనని వారు కొట్టిపారేశారు. “ఒక డ్రెస్ స్టైల్ మారితేనే ఇంత పెద్ద కథ తయారవడం ఆశ్చర్యంగా ఉంది” అంటూ ఆ వర్గాలు వ్యాఖ్యానించినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ గాసిప్‌లపై శోభిత ధులిపాల, నాగ చైతన్య లేదా అక్కినేని కుటుంబం నుంచి అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు. ఇద్దరూ తమ తమ సినిమా ప్రాజెక్టులపై దృష్టి సారించారని ఇండస్ట్రీలో టాక్. నిజంగా శుభవార్త ఏదైనా ఉందా? లేక ఇదంతా సోషల్ మీడియా ఊహాగానాలేనా? అన్నది అధికారిక స్పందన వచ్చే వరకు సస్పెన్స్‌గానే కొనసాగనుంది.



## దేవర–2’పై స్పష్టత... ఫ్యాన్స్‌కు ఊరట




జూనియర్ ఎన్టీఆర్ కెరీర్‌లో భారీ విజయంగా నిలిచిన దేవర విడుదలై ఏడాదిన్నర గడిచినా, సీక్వెల్‌పై అధికారిక సమాచారం లేకపోవడంతో అభిమానుల్లో అయోమయం కొనసాగింది. ఒకసారి రెండో భాగం ఉంటుందన్న ప్రచారం, మరోసారి లేదన్న వార్తలు వినిపించడంతో గందరగోళం మరింత పెరిగింది. ఈ అనుమానాలకు దర్శకుడు కొరటాల శివ మీడియాకు పెద్దగా అందుబాటులో లేకపోవడమే కారణమైంది. తారక్ పుట్టినరోజు సందర్భంగా దేవర-2 ఉందన్న సంకేతంగా ఓ చిన్న పోస్టర్ విడుదల చేసినప్పటికీ, స్పష్టమైన అప్డేట్ మాత్రం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో తాజాగా నిర్మాతల్లో ఒకరైన సుధాకర్ మిక్కిలినేని చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చకు దారితీశాయి. జనగామలో నిర్వహించిన ఓ ఉత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సుధాకర్, వేదికపై యాంకర్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ దేవర-2 మే నెల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. వచ్చే ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని ప్రకటించారు. అంతేకాదు, అంచనాలను మించే స్థాయిలో ఈ చిత్రం భారీ విజయం సాధిస్తుందని కూడా ధీమా వ్యక్తం చేశారు. దీంతో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానంతరం జూనియర్ ఎన్టీఆర్ నటించబోయే ప్రాజెక్ట్ ఇదేనన్న విషయం దాదాపు ఖరారైనట్టైంది. భారీ సినిమాల నిర్మాణం, పోస్ట్ ప్రొడక్షన్ దశలకు కనీసం ఏడాది పైగా సమయం పట్టే అవకాశముండటంతో, 2027 దసరా లేదా దీపావళి సమయంలో దేవర-2 విడుదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే ఆంతరంగికంగా హైప్‌ను నిలబెట్టడం కొరటాల టీమ్‌కు పెద్ద సవాలుగా మారనుంది.

## వెంకటేశ్–తరుణ్ భాస్కర్ ప్రాజెక్ట్‌పై తాజా అప్డేట్



ఫ్యామిలీ హీరో వెంకటేశ్‌తో దర్శకుడు తరుణ్ భాస్కర్ తెరకెక్కించాల్సిన సినిమా చాలాకాలంగా వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా ‘ఓం శాంతి శాంతి శాంతిః’ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తరుణ్ ఈ ప్రాజెక్ట్‌పై కీలక వ్యాఖ్యలు చేసి ఆసక్తి రేపారు.

2019లో గుర్రపు పందెం జూదగాడి నేపథ్యంతో ‘డెక్కన్ డెర్బీ’ పేరుతో ఈ సినిమాను ప్లాన్ చేసినట్లు వెల్లడించిన తరుణ్, సురేశ్ బాబు కూడా నిర్మాణానికి అంగీకరించినప్పటికీ కొన్ని కారణాల వల్ల ప్రాజెక్ట్ నిలిచిపోయిందన్నారు. స్క్రీన్‌ప్లే ముఖ్యంగా రెండో భాగంలో ఇంకా మెరుగులు అవసరమని, టెక్నికల్ ప్రమాణాలు కూడా కారణమయ్యాయని చెప్పారు. ప్రస్తుతం స్క్రిప్ట్‌పై మళ్లీ సీరియస్‌గా పని చేస్తున్నానని స్పష్టం చేశారు.షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందన్న ప్రశ్నకు, ఈ ఏడాదైనా కావొచ్చని లేదా తర్వాతైనా కావొచ్చని, మొత్తం తన సిద్ధతపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఈ చిత్రం పట్టాలెక్కితే, తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో స్టార్ హీరో ప్రధాన పాత్రలో నటించే తొలి చిత్రంగా నిలవనుంది.

ఈ ప్రాజెక్ట్ క్రైమ్ కామెడీ లేదా హారర్ కామెడీ నేపథ్యంలో ఉండొచ్చని, వెంకటేశ్ బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా కొత్తగా రూపొందుతున్నట్లు తరుణ్ తెలిపారు. మరోవైపు వెంకటేశ్ ప్రస్తుతం పలు చిత్రాలతో బిజీగా ఉన్నప్పటికీ, ఈ కాంబినేషన్ నిజమైతే టాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారుతుందనే అంచనాలు ఉన్నాయి. ఈ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా హాజరైన విశ్వక్ సేన్, తరుణ్ తనకు బిగ్ సపోర్టర్ అని పేర్కొంటూ, అతను మళ్లీ దర్శకత్వం వైపు త్వరగా రావాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు.

## ఈసారి బాలీవుడ్ యంగ్ హీరోతో..



టాలీవుడ్‌లో ‘సీతారామం’, ‘హాయ్ నాన్న’ చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మృణాల్ ఠాకూర్ మరోసారి వ్యక్తిగత జీవితంతో వార్తల్లో నిలిచింది. గతంలో ధనుష్‌తో డేటింగ్ రూమర్స్ చక్కర్లు కొట్టినా, అవి కేవలం గాసిప్‌లేనని ఆమె టీమ్ ఖండించింది. తాజాగా బాలీవుడ్ యంగ్ హీరో సిద్ధాంత్ చతుర్వేదితో మృణాల్ రిలేషన్‌షిప్‌లో ఉందంటూ ప్రచారం ఊపందుకుంది. వీరిద్దరూ కలిసి నటించిన ‘దో దీవానే సేహర్ మేన్’ సినిమా ప్రమోషన్లలో కనిపిస్తున్న సాన్నిహిత్యం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. ఇటీవల పబ్లిక్ ఈవెంట్లలో జంటగా హాజరవడం, సోషల్ మీడియాలో వచ్చిన పోస్టులు నెటిజన్లలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. అయితే ఇది నిజమైన ప్రేమకథా? లేక సినిమా ప్రచార వ్యూహమా? అన్నది మాత్రం ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.



## సర్దానా.. అందాలతో చంపేనా?

యువ నటి రోజ్ సర్దానా తన గ్లామర్ మరియు నటనతో ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా నిలుస్తున్నారు. ఇటీవల ఆమె షేర్ చేసిన చీరకట్టు మరియు మోడ్రన్ ఫొటోషూట్‌లు సోషల్ మీడియాను ఊపేస్తున్నాయి. మినిమల్ మేకప్, సింపుల్ ఆభరణాలతో ఆమె చూపుతున్న హొయలు ఫ్యాషన్ ప్రియులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు, రోజ్ తన సినీ కెరీర్‌లో ఒక భారీ అవకాశాన్ని దక్కించుకున్నారు. బాలీవుడ్ బ్లాక్ బస్టర్ ఫ్రాంచైజీ 'భూల్ భూలయ్యా 3' లో ఆమె కీలక పాత్ర పోషించినట్లు సమాచారం.సింపుల్ అండ్ ఎలిగెంట్ లుక్స్‌తో రోజ్ సర్దానా నెట్టింట వైరల్‌గా మారారు. ఆమె స్టైలిష్ ఫొటోలపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.కార్తీక్ ఆర్యన్ హీరోగా తెరకెక్కిన 'భూల్ భూలయ్యా 3'లో రోజ్ నటించారు. ఇందులో ఆమె తృప్తి దిమ్రి కి సోదరిగా కనిపించనున్నట్లు తెలుస్తోంది.విద్యాబాలన్, మాధురీ దీక్షిత్ వంటి దిగ్గజ నటీమణులతో కలిసి నటించడం రోజ్ కెరీర్‌కు పెద్ద ప్లస్ కానుంది.'కుండలి భాగ్య' వంటి పాపులర్ సీరియల్స్ ద్వారా గుర్తింపు పొందిన రోజ్, ఇప్పుడు వెండితెరపై తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.ఈ సినిమా విజయవంతమైతే, రోజ్ సర్దానా మరిన్ని పెద్ద ప్రాజెక్టులతో బిజీ అయ్యే అవకాశం ఉంది

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com